JANA SAINYAM

# జనసైన్యం

ప్రజల పక్షం జనసైన్యం

తెలుగు దినపత్రిక



కరీంనగర్ జిల్లా. సంపుటి 3. సంచిక 304 23 మంగళవారం జూన్ 2026 ఎడిటర్ గుంటపల్లి స్వామి https://epaper.janasainyam.in పేజీలు: 12 రూ.5

# ఇండ్లు ఇస్తారా...ఆక్రమించమంటారా?

**జనసైన్యం సిటి**

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం సిపిఐ కలెక్టరేట్ ముందు ధర్నా. గత ప్రభుత్వ హయాంలో నిర్మించి ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పేదలకు పంచుతారా లేక సిపిఐ ఆధ్వర్యంలో ఆక్రమించుకోమంటారా తక్షణమే తెలపాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ సూటి ప్రశ్న వేశారు. అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని సోమవారం కరీంనగర్ కలెక్టర్ కార్యాలయం ముందు సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగిందని సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ కరీంనగర్ నగరంలో ఎంతో మంది నిరుపేదలు ఇండ్లు లేక అద్దె ఇండ్లల్లో నివాసం ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారని రోజువారీ కూలీ పనులు చేసుకొని,చిన్న చిన్న ప్రైవేట్ ఉద్యోగాలు చేసుకొని చాలీ చాలని ఆదాయంతో కుటుంబాలను పోషించుకుంటు,ఇంటి అద్దె కట్టలేక,ఆర్థికంగా ఏమీ లేని కుటుంబాలు కావడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని. గత ప్రభుత్వ హాయంలో దాదాపు 600ఇండ్లను చింతకుంట ప్రాంతంలో నిర్మాణం చేసి ఉన్నాయని,నిర్మించి దాదాపు పది సంవత్సరాలు కావస్తున్నా నేటికీ వాటిని అర్హులైన వారికి కేటాయించకపోవడం వల్ల అవి నిరుపయోగంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటినా ఇప్పటివరకు వాటిని పంపిణీ చేయలేదని,తక్షణమే ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్లు పంపిణీ






చేస్తదా లేక సిపిఐ ఆధ్వర్యంలో పేదలచే ఆ డబుల్ బెడ్ రూం ఇండ్లను ఆక్రమించమంటారా ప్రభుత్వం తేల్చాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు .ధర్నా అనంతరం రెవిన్యూ డివిజనల్ అధికారి (ఆర్.డి. ఓ) షర్మిల కు సిపిఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు న్యాలపట్ల రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు,బీర్ల పద్మ,కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, కొట్టె అంజలి, ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు వరుకోలు సదానందం, దుడ్డేల సమ్మయ్య, సిపిఐ శాఖ కార్యదర్శులు గామినేని సత్యం,చెంచల మురళి, నగునూరి రమేష్,నునావత్ శ్రీనివాస్,బాకం ఆంజనేయులు, ఈ.భారతి,కాల్వ శ్రీనివాస్,తంగెళ్ళ సదయ్య, కసిరెడ్డి సందీప్ రెడ్డి, బోయిని విష్ణు, మమత, స్వాతి,భూక్యా ముని, స్రవంతి, గుర్రం సదానందం,బరిగెల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వాయర్‌ను తనిఖీ చేసిన డిప్యూటీ మేయర్ సునీల్ రావు.



**జనసైన్యం సిటి**

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 42వ డివిజన్ భగత్ నగర్ మంచి నీటి రిజర్వాయర్‌ను సోమవారం నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు అకస్మికంగా తనిఖీ చేశారు. గత కొన్ని రోజులుగా భగత్ నగర్ ప్రాంతంలోని పలు కాలనీల్లో ప్రతిరోజు లీకేజీ సమస్యతో భారీగా తాగునీరు వృధా అవుతోందన్న విషయాన్ని గమనించి స్వయంగా మంచి నీటి రిజర్వాయర నను సందర్శించారు. రిజర్వాయర్ లో ప్రధాన డిస్ట్రిబ్యూషన్, ఫిల్లింగ్ పైపులైన్లను, గేట్ వాల్స్, సంపు, మోటార్ పంపులతో పాటు రిజర్వాయర్ ఆవరణలో డ్రైనేజీ సిస్టమ్ ను స్వయంగా పరిశీలించి... నీరు లీకేజీ కారణాలను అన్వేషించారు. లీకేజీ సమస్యలకు గల సాంకేతిక కారణాలను, వాల్స్, సంపు, మోటార్ పంపుల స్థితిగతులు, పని చేస్తున్న సిబ్బంది వివరాలను స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ... నగర ప్రజలకు సరఫరా కావాల్సిన సురక్షిత తాగునీరు లీకేజీ సమస్యల వల్ల వృధాగా రోడ్లపాలు కావడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. భగత్ నగర్ మంచి నీటి రిజర్వాయర్ పరిదిలో గతంతో 9 మంది సిబ్బంది పని చేసే చోట... ప్రస్తుతం ముగ్గురు మాత్రమే పని చేస్తున్నారని తెలిపారు. దీంతో సిబ్బంది సరఫరా సమయంలో కాలనీల్లో పర్యవేక్షిస్తున్న సమయంలో ట్యాంకులు, సంపులు నిండి పోయి నీరు వృధాగా బయటకు రావడం జరిగిందని తెలిపారు. రిజర్వాయర్, సంపులు పూర్తిగా నిండిన నీరు పోవడానికి సరైన డ్రైనేజీ సిస్టమ్ సరిగా లేకపోవడం తో మంచి నీరు వృధాగా కాలనీల రోడ్ల పై వరద ప్రవహిస్తుందని అన్నారు. గతంలో శిథిలావస్థకు చేరి కూలిపోయిన డ్రైనేజీలను ఇప్పటి వరకు నిర్మాణ మరమ్మతులు చేయలేదని తెలిపారు. సంబంధిత డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, రిజర్వాయర్ లో సరిపడా సిబ్బంది లేక, మంచి నీరు బయటకు వచ్చి భగత్ నగర్ సంబంధిత ఏరియా మొత్తం జలమయం అవడం జరుగుతుందని తెలిపారు. సంబంధిత సమస్య పట్ల వెంటనే కమీషనర్, అధికారులు స్పందించి... మంచి నీరు వృధాగా పోవడానికి గల కారణాలను గుర్తించి త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని కోరారు. అంతే కాకుండా భగత్ నగర్ రిజర్వాయర్ పరిదిలో మంచి నీటి పైపులైన్ లీకేజీలు దాదాపు ఒక 20 ఉన్నట్లు గతంలోనే గుర్తించడం జరిగిందన్నారు. సంబంధిత పైపులైన్ లీకేజీలు, వాల్స్ మరమ్మతుల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దని, యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసి నీటి వృధాను అరికట్టాలన్నారు. నగర ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా చూడటమే నగరపాలక సంస్థ ప్రథమ కర్తవ్యమన్నారు. ప్రజలకు సురక్షిత మైన త్రాగు నీరు అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు త్రాగు నీరు అందించే భగత్ నగర్ రిజర్వాయర్ పరిసర ప్రాంతాలను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. పైపులైన్, వాల్స్ లీకేజీలు, రిజర్వాయర్ అపరిశుభ్ర వంచి సమస్యల వల్ల ప్రజలకు సరఫరా చేసే సురక్షిత నీరు కలుషితం కాకుండా అధికారులు, సిబ్బంది చర్యలు తీస్కోవాలన్నారు. ప్రజలు నగరపాలక సంస్థ ద్వారా అందిస్తున్న సురక్షిత మంచి నీటి సరఫరా పై పూర్తి విశ్వాసం పెట్టుకున్నారని... అట్టి నమ్మకం విశ్వాసం కోల్పోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భగత్ నగర్ తో పాటు నగర వ్యాప్తంగా లీకేజీలను గుర్తించి ఎప్పటికప్పుడు అరికట్టాలని త్రాగు నీటి వృధా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు.

## మంత్రి శ్రీధర్ బాబును విమర్శించే స్థాయి పుట్ట మధుకు లేదు

### టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం



**జనసైన్యం సిటి**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పెద్ద ఎత్తున అక్రమ ఆస్తులు కూడబెట్టారని, ఆయనకు సంబంధించిన పూర్తి ఆస్తుల చిట్టా ప్రస్తుతం తమ ముందు సిద్ధంగా ఉందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం సంచలన ఆరోపణలు చేశారు. సోమవారం కరీంనగర్ నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్, కేటీఆర్‌లతో పాటు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

**రూ.900 కోట్ల ఆస్తులు ఎక్కడివి?**

బీఆర్ఎస్ పార్టీ మూడు వేల కోట్లు దోచుకుంటే, మంథని మధుకు తొమ్మిది వందల కోట్ల ఆస్తులు ఎక్కడి నుండి వచ్చాయని ఆయన నిలదీశారు. కేసీఆర్, కేటీఆర్‌లు లక్షల కోట్లు సంపాదిస్తే, గత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేల కోట్లు వెనకేశారని ఆరోపించారు. పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ కాకముందు పుట్ట మధు ఆస్తులు ఎంత, ప్రస్తుతం ఎంత అనే విషయాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. పుట్ట మధు ఆస్తులపై విచారణ జరపాలన్నారు.

**శ్రీపాద రావు పెట్టిన బిక్షతోనే రాజకీయం**

దివంగత నేత దుద్దిళ్ల శ్రీపాద రావు పెట్టిన రాజకీయ బిక్షతోనే పుట్ట మధు ఈ స్థాయికి వచ్చారని గజ్జల కాంతం గుర్తు చేశారు. ప్రస్తుత మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఇంటి గేటు వద్ద నిలబడితే, ఆయన దయతో బిక్షగా జెడ్పీటీసీగా పోటీ చేసే అవకాశం వచ్చిందని, ఆ పాత చరిత్రను ఒకసారి గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గురించి మాట్లాడే నైతిక అర్హత పుట్ట మధుకు లేదని, పుట్ట మధు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు.

**ఇసుక దందా, గంజాయి వ్యాపారం, హత్య కేసుల ఆరోపణ**

కేవలం ఒకే ఒక్కసారి ఎమ్మెల్యే అయిన వ్యక్తికి వేల కోట్ల ఆస్తులు ఎలా సాధ్యమని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఇసుక దందా, గంజాయి వ్యాపారాలు చేస్తూ అక్రమాలకు పాల్పడ్డారని, గతంలో దళిత వ్యక్తిపై దాడులు చేయించడమే కాకుండా, సంచలనం సృష్టించిన అడ్వకేట్ దంపతుల హత్య ఉదంతం వెనుక ఉన్నది నువ్వు కాదా అని పుట్ట మధును నేరుగా ప్రశ్నించారు. గతంలో మంథని మధును చంపి కాలువలో పడేసింది మీ అనుచరులేనని ఆరోపించారు.

**కాళేశ్వరం పేరిట భారీ దోపిడీ**

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని భారీ అప్పుల ఊబిలోకి నెట్టి ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని గత ప్రభుత్వం రాష్ట్రాన్ని సుమారు రూ.8 లక్షల కోట్ల అప్పుల పాల్జేసిందని, అందులో రూ.3 లక్షల కోట్లను దోచుకున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట రూ.1.50 లక్షల కోట్ల వ్యయంలో లక్ష కోట్ల రూపాయల మేర అవినీతి జరిగిందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో వేల కోట్ల విలువైన సుమారు 30 వేల ఎకరాల భూములను ఆక్రమించారని మండిపడ్డారు.

**బీఆర్ఎస్ బీజేపీలో విలీనం ఖాయం**

రాబోయే రోజుల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీని పూర్తిగా బొంద పెడతారని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ బీజేపీలో విలీనం కాబోతుందంటూ ఆయన ఈ సందర్భంగా రాజకీయ జోస్యం చెప్పారు. పదేళ్ల పాటు దొర కుటుంబాన్ని నమ్మి మోసపోయిన ప్రజలు ఇకపై ఆ పార్టీని మరో పదేళ్లయినా నమ్మే పరిస్థితి లేదని గజ్జల కాంతం వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీపై ప్రజలు పూర్తిగా విశ్వాసం కోల్పోయారని, మళ్లీ ఆ పార్టీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తాను గనుక నోరు తెరిస్తే తట్టుకోలేక ఊరేసుకునే పరిస్థితి వస్తుందని, కాబట్టి మాట్లాడే ముందు జాగ్రత్తగా మాట్లాడాలని పుట్ట మధుకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సముద్రాల అజయ్, కేశవేని రవీందర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి లత దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు



అభిజ్ఞకు జన్మదిన శుభాకాంక్షలు



లక్ష్మికి జన్మదిన శుభాకాంక్షలు

# ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

జనసైన్యం సిటి




పిడిఎస్యు ఆధ్వర్యంలో కరీంనగర్ పట్టణంలో గల హౌసింగ్ బోర్డు లోని కుమార్ వాడీ లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎదుట మూసివేసిన 23 వేల ప్రభుత్వ పాఠశాలలను రీ ఓపెనింగ్ చేయాలని నిరసన కార్యక్రమం చేయడం జరిగింది..ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ ప్రధాన కార్యదర్శి కూతాటి రాణా ప్రతాప్ మాట్లాడుతూ....రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బ్రేక్ ఫాస్ట్ అండ్ మిల్క్ పథకాన్ని అన్ని జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయాలని,ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టాయిలెట్స్ లేవని,వర్షాకాలం వర్షం లో కొన్ని క్లాస్ రూమ్స్ ఊరుస్తాయని వాటి స్థానంలో నూతన రూమ్ లను ఏర్పాటు చేయాలని,సకాలంలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ పూర్తి స్థాయిలో ఇవ్వాలని,ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు సమస్యల వలయంలో ఉన్నాయని వారన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ స్కూల్లను మూసివేసి ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలకు అనుమతులు ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు చనిపోతున్న ఏమి పట్టించుకోని పరిస్థితి ఉందని,ప్రభుత్వం ఇంటర్నేషనల్ స్కూల్ అని తీసుకొస్తున్నామని చెప్పుతున్నారు.కానీ ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యను పరిష్కరించకుండా ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయకుండా విద్యార్థులు చదువులకు దూరం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల పక్కన ప్రైవేటు పాఠశాలకు అనుమతిస్తూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు లేరని సానుకూలతతో పాఠశాలను మూసివేసే పరిస్థితి తీసుకొస్తున్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మూసివేసిన పాఠశాలలో ఓపెన్ చేయాలని విద్యార్థులకు న్యాయం చేయాలని అనుమతులు లేకుండా నడిపిస్తున్న పాఠశాలలు అధిక ఫీజులు అసలు చేస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకొని వాటిని గుర్తింపు రద్దు చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.విద్యారంగ సమస్యలు పరిష్కరించని యెడల జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరిస్తున్నాం...

ఈ కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా అధ్యక్షుడు లోకిని రమేష్,జిల్లా ఉపాధ్యక్షుడు అస్లాం అహ్మద్ ఖాన్,జిల్లా సహాయ కార్యదర్శి అంగడి దేవేందర్,నాయకులు పోలిశెట్టి అశోక్,మేడ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి.



జనసైన్యం సిటి

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని ధర్నా నిర్వహించి అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా గారికి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని అన్నారు.ప్రభుత్వం జూన్ 12 నాటికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ తదితర సౌకర్యాలను అందజేస్తామని ప్రకటించింది. అయితే పాఠశాలలు ప్రారంభమై చాలా రోజులు గడిచినా ఇప్పటికీ విద్యార్థులకు యూనిఫాంలు పూర్తిస్థాయిలో అందలేదు. పాఠ్యపుస్తకాలలో కూడా కొన్ని టైటిల్స్ అందుబాటులో లేవు.అలాగే మధ్యాహ్న భోజన పథకం అమలులో అనేక సమస్యలు కొనసాగుతున్నాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా నిధులు పెంచకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం కష్టంగా మారింది. అక్షయపాత్ర, ఇస్కాన్, మన్నా వంటి సంస్థల ద్వారా అందిస్తున్న భోజనం నాణ్యతపై కూడా పలు ప్రాంతాల నుండి ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మధ్యాహ్న భోజన పథకానికి తగిన నిధులు కేటాయించి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలి.ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చాయి. పుస్తకాలు, నోట్‌బుక్స్, బెల్టులు, టైలు, షూలు, సాక్సులు తదితర వస్తువులను విద్యార్థులపై బలవంతంగా కొనుగోలు చేయిస్తున్నారు. పాఠశాలలకు ఆకర్షణీయమైన పేర్లు జోడించి ప్రచారం చేస్తూ నర్సరీ స్థాయి నుంచే లక్షలాది రూపాయల ఫీజులను వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించే ప్రత్యేక చట్టాన్ని వెంటనే అమలు చేయాలని కోరుతున్నాము.అదేవిధంగా రాష్ట్రంలోని సుమారు 27,000 ప్రభుత్వ పాఠశాలలను 4,000 పాఠశాలలుగా కుదించే ప్రతిపాదన ప్రభుత్వ విద్యా వ్యవస్థకు నష్టం కలిగించే ప్రమాదం ఉంది. కాబట్టి పాఠశాలల సంఖ్యను తగ్గించకుండా జనాభా ప్రాతిపదికన కొత్త ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేసి, ఇప్పటికే ఉన్న పాఠశాలలను బలోపేతం చేయాలని కోరుతున్నాము. కరీంనగర్ జిల్లాలో 16 మండలాలు ఉంటే చాలా మండలాల్లో రెగ్యులర్ ఎంఈఓ లేని పరిస్థితి ఉంది. కావున ఖాళీగా ఉన్న ఎంఈఓ, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నాం.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కంపెల్లి అరవింద్, జిల్లా ఉపాధ్యక్షులు ఇషాక్, జిల్లా సహాయ కార్యదర్శి గట్టు ఆకాష్, జిల్లా కమిటీ సభ్యులు రత్నం సురేష్ సందేశ్, సన్నీ, అక్షయ్ మానస సంజన, సాయి తదితర విద్యార్థులు పాల్గొన్నాయి.

# చలో సెక్రటేరియట్ విజయవంతం చేయండి

జనసైన్యం సిటి

హైదరాబాదులో ప్రెస్ క్లబ్ లో ప్రెస్ మీట్ లో ఈనెల 23న సెక్రటేరియట్ ముట్టడి చేయాలని పత్రికల ప్రకటన ద్వారా విడుదల చేస్తూ రాష్ట్రంలోని కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల్లో కొనసాగుతున్న అక్రమ ఫీజుల దోపిడీని అరికట్టాలి పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ యూనిఫామ్ బలవంతంగా కొనిపిస్తున్నారు .మా ప్రధాన డిమాండ్స్

పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి ప్రభుత్వ పాఠశాలలో కళాశాలలో హాస్టల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి. కార్పొరేట్ విద్య దోపిడీని అరికట్టాలి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి విద్యా హక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని అందరికీ నాణ్యమైన సమానమైన విద్య అందించాలి. అదేవిధంగా పర్మిషన్ లేకుండా నడుపుతున్న జూనియర్ కళాశాలలను మూసివేయాలనే డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయక విద్యార్థులను సఫర్ చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం తక్షణమే స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని కళాశాలలో చదువు పూర్తి చేసుకొని వెళ్లాలని కళాశాలలో సర్టిఫికెట్లు అడుగుతే విద్యార్థులు ఫీజు కడితే కానీ ఇవ్వని యజమాన్యం విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నాయి గురుకులాల్లో సంక్షేమ హాస్టల్లో కలిసే వాతలు లేక విద్యార్థులు చదువుకో దూరమయ్యే విధంగా ఉన్నారు హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు విద్య రంగంపై ప్రభుత్వం చూస్తున్న నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాం .





కుమార్ కు జన్మదిన శుభాకాంక్షలు



గౌతమ్ సిద్ధార్థకు జన్మదిన శుభాకాంక్షలు



రాజ్ గోపాల్ కు జన్మదిన శుభాకాంక్షలు

# శారీరక కదలికలే ఆరోగ్య ప్రదాతలు

## (23 జూన్ "అంతర్జాతీయ ఒలంపిక్ దినోత్సవం" సందర్భంగా)

డా: మధుసూదన్ రెడ్డి బుర్ర

క్రీడలు ఆనంద వేదికలు. క్రీడలు సమైక్యతను పోషించే సాధనాలు. ఆరోగ్యకర శరీరానికి చవకైన, అధిక ప్రభావం కలిగిన క్రీడలు ఉపకరిస్తాయి. శారీరక స్తబ్దత ఒక నిశ్శబ్ద ప్రపంచ విపత్తుగా మారుతూ, రేపటి ప్రజారోగ్యాన్ని పాతరేయచూస్తున్నది, రోగాల ముప్పు ముందు నిలబెడుతున్నది. క్రీడా విభాగం నినాదం "దృఢమైన శరీరంలో పదునైన మెదడు" అని మనకు తెలుసు. శారీరక దృఢత్వం ఉంటేనే మెదడు చురుకుగా పని చేస్తుంది. లాభాపేక్షలేని, ప్రభుత్వేతర అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థగా "అంతర్జాతీయ ఒలంపిక్ సంస్థ (ఐఓసి)" ప్రపంచ మానవాళిని ఏకం చేయడానికి క్రీడా స్థలాలను కేంద్రంగా చేసుకుంది. తను సేకరించిన 90 శాతానికి పైగా నిధులను క్రీడలకే ఖర్చు చేస్తున్న ఐఓసి సగటున ప్రతి రోజు దాదాపు 4.7 మిలియన్ డాలర్లను ప్రపంచవ్యాప్తంగా వెచ్చిస్తున్నది.

### మీరు చేయగలరు : ఐక్యంగా కదులుదాం :

ఐదు కలిసి ఉన్న రింగులు ఒలంపిక్ సంస్థను సూచిస్తాయి. నీలం, పసుపు, నలుపు, ఆకు పచ్చ, ఎరుపు రంగుల రింగులు మానవ సహిత ఐదు ఖండాలను సూచిస్తున్నాయి. ఒలంపిక్ జెండా పై ఉన్న ఐదు రింగులతో పాటు "ఫాస్టర్, హైయ్యర్, స్ట్రాంగర్ – ఐక్యతతో" అనే నినాదం ఉంటుంది. 1913లో "బారెన్ పెరీ డి కుబెర్టీన్" అను ఫ్యారిస్ దేశస్థుడు రూపొందించింది. అంతర్జాతీయ ఒలంపిక్ కమిటీని తెలిసారి స్థాపించడా జరిగింది. ఐఓసి వ్యవస్థాపక దినంగా 23 జూన్ 1948 నుంచి ప్రతి ఏట "అంతర్జాత ఒలంపిక్ దినోత్సవం (ఇంటర్నేషనల్ ఒలంపిక్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. 2026 అంతర్జాతీయ ఒలంపిక్ దినోత్సవ నినాదంగా "మీరు చేయగలరు : ఐక్యంగా కదులుదాం (యూ కెన్ డూ దిస్ : లెటజ్ మువ్)" అనబడే అంశాన్ని తీసుకున్నారు. అన్ని వర్గాల ప్రజలను క్రీడల పట్ల ఆకర్షిస్తూ వారి ఆరోగ్యానికి పునాదులు ఆటలు ఉపకరిస్తున్నాయి.




శ్రేష్టత, స్నేహశీలత, గౌరవం అనే పునాదుల మీద ఒలంపిక్ జెండా రెపరెపలాడుతున్నది. అంతర్జాతీయ ఒలంపిక్ దినం వేదికగా క్రీడాకారులు, క్రీడాభిమానులు కలిసి మైదానంలో ఆడుతూ, ఆనంద సాగరంలో మునుగుతూ, సరదాగా "ఒలంపిక్ పరుగు" లేదా "ఒలంపిక్ రన్"ను పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతోంది. నేడు దాదాపు 150కి పైగా "జాతీయ ఒలంపిక్ కమిటీ (ఎన్ఓసి)"లు చురుకుగా పని చేస్తూ "శారీరక చురుకుదనం, ఆరోగ్యవంతమైన జీవితం" అనే నినాదంతో వాడవాడలా, ఊరు ఊరున ఒలంపిక్ జ్యోతి రుగులుతోంది, క్రీడాభిమానాన్ని వెల్లడిస్తున్నది.

"కదలడం, నేర్వడం, అన్వేషించడం" అను మూడు అంశాల చుట్టు ఒలంపిక్ కమిటీలు తిరుగుతున్నాయి. విద్యలో క్రీడలు భాగమై యువత శారీరక మానసిక వికాసానికి తోడ్పాటుపడ ఇవ్వాలి. క్రీడా మైదానాలు విద్యార్థినీవిద్యార్థులతో పాటు యువతతో నిండిపోవాలి. రేపటి దృఢమైన మేధోసంపత్తికి బాటలు వేసే విధంగా క్రీడలు యువత జీవనశైలితో విడదీయరాని అంగం కావాలి. క్రీడల ప్రాధాన్యాన్ని ఏకరువు పెడుతూ, ఆటలు ఆడుతూ, చెమట కక్కుతూ, గెలుస్తూ, ఓడుతూ, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూ, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా దేశాభివృద్ధిలో భాగస్వామ్యం అవుదాం, గెవడాన్ని జీవితంలో భాగం చేసుకుందాం.

# ఎస్ఆర్ఆర్ కళాశాలలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



**జనసైన్యం సిటి**

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ కళాశాలలో జాతీయ సేవా పథకం (NSS) యూనిట్ల ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగా ప్రాముఖ్యతను తెలుసుకుంటూ వివిధ యోగాసనాలను అభ్యసించారు. కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీ పి.నితిన్ పాఠక్ మరియు టీ. కరుణాకర్ యోగా ట్రైనర్‌గా వ్యవహరించి విద్యార్థులకు, అధ్యాపకులకు వివిధ యోగాసనాల గురించి వివరించారు. యోగా కేవలం శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా మానసిక ప్రశాంతతను, ఆత్మవిశ్వాసాన్ని, ఏకాగ్రతను పెంపొందిస్తుందని ఆయన తెలిపారు. ప్రతిరోజూ కొంత సమయం యోగాకు కేటాయిస్తే జీవితంలో అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా సూర్యనమస్కారాలు, తాడాసనం, వృక్షాసనం, భుజంగాసనం, వజ్రాసనం, ప్రాణాయామం వంటి అనేక యోగాసనాలను ప్రదర్శించి వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. విద్యార్థులు కూడా ఉత్సాహంగా పాల్గొని యోగాసనాలను అభ్యసించారు. యోగా ద్వారా శరీరం దృఢంగా మారడమే కాకుండా మనస్సు ప్రశాంతంగా ఉండి విద్యార్థులలో ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమాన్ని NSS ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ అర్జున్, ఎలిజబెత్ రాణి, రాజేందర్, వెంకటేశ్వర్లు మరియు తిరుపతి సమన్వయం చేశారు. NSS యూనిట్లు నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా యువతలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యమని వారు పేర్కొన్నారు. నేటి ఆధునిక జీవనశైలిలో ఒత్తిడి, ఆందోళన, అనారోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో యోగా ప్రతి ఒక్కరికీ అవసరమని వారు సూచించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వారసత్వమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది యోగాను ఆచరిస్తూ ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవర్చుకుంటున్నారని తెలిపారు. విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కూడా సమానంగా పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రతిరోజూ కనీసం కొంత సమయం యోగాకు కేటాయించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని ఆయన తన సందేశంలో పేర్కొన్నారు.

కార్యక్రమంలో కళాశాల మరో వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య, జేపీసీ చైర్మన్ కే. సురేందర్ రెడ్డి,కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ (COE) టి.శ్రీనివాస్ , స్టాఫ్ క్లబ్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి వివిధ విభాగాల హెచ్ఓడీలు, అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లుపాల్గొని యోగా ప్రాముఖ్యతపై మాట్లాడారు. విద్యార్థులు తమ దినచర్యలో యోగాను భాగంగా చేసుకోవాలని, ఇది క్రమశిక్షణతో కూడిన ఆరోగ్యకరమైన జీవన విధానానికి దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థులు శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యాన్ని కూడా పెంపొందించుకోవడానికి యోగా ఎంతో ఉపయుక్తమని పేర్కొన్నారు. అలాగే వివిధ విభాగాల అధ్యాపకులు కూడా యోగా దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. యోగా అనేది కేవలం వ్యాయామ విధానం మాత్రమే కాకుండా సంపూర్ణ జీవన విధానమని, శరీరం, మనస్సు మరియు ఆత్మ మధ్య సమతుల్యతను నెలకొల్పే గొప్ప సాధనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు యోగాసనాలను ఆసక్తిగా అభ్యసించి, యోగా వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన పొందారు. ముఖ్యంగా ప్రాణాయామం, ధ్యానం వంటి సాధనల ద్వారా మానసిక ప్రశాంతతను పొందవచ్చని అన్నారు. యోగా ఆరోగ్యవంతమైన జీవనానికి మార్గదర్శకమని అన్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం అధ్యాపకులు, విద్యార్థుల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషించింది. భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన యోగాను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, NSS వాలంటీర్లు, వివిధ విభాగాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వితంతువుల పట్ల వివక్ష తగునా ?

## (23 జూన్ "అంతర్జాతీయ వితంతువుల దినం" సందర్భంగా)

డాక్టర్ : బుర్ర మధుసూదన్ రెడ్డి

అత్యాధునిక ఏఐ యుగంలో కూడా వితంతువుల పట్ల అమానవీయ వివక్ష కొనసాగుతోంది. వితంతువులు కూడా సాధారణ మానవులే అని, విధి విధించిన శాపంగా వారు తమ భర్తను కోల్పోయి, దుఃఖసాగరం మునిగినప్పటికీ, వారు చేసిన తప్పు ఏమీ లేదని తెలిసినా, ఈ పౌర సమాజం వితంతువును రెండవ శ్రేణి మహిళగా చూడడం, అడుగడుగునా ఆమెను అవమానపరచడం చూస్తున్నాం, నిశ్శబ్దంగా మన పని మనం చేస్తూ పోతున్నాం. మన ఇంట్లో వితంతువు ఉన్నట్లయితే, దురదృష్టవశాత్తు మన అమ్మే అయినా, మనం తనకు తగు ప్రాధాన్యం ఇవ్వకుండా, సంఘ బహిష్కరణ చేసినట్లుగా, పలు శుభకార్యాల్లో తెర వెనుక ఉండమని అవమానపరుస్తూ, నిత్యం తమను సాంప్రదాయాలు లేదా మూఢ విశ్వాసాల పేరున వెధిస్తూనే ఉన్నాం. తన అర్ధ భాగమైన జీవిత భాగస్వామిని కోల్పోయి అనంత దుఃఖంలో ఉన్న మహిళను మన ఆచార సాంప్రదాయాలు మరింత వేధించడం, అమానవీయంగా చూడడం జరుగుతుంది.

**అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం-2026:**

వితంతువుల సమస్యలను గుర్తించడం, పరిష్కారాలు చూపడం, ఆ అభాగ్యుల మానవ హక్కులను పరిరక్షించడం వంటి కార్యక్రమాల నిర్వహణకు ప్రతి ఏటా 23 జూన్ రోజున "అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం (ఇంటర్నేషనల్ విడో డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. 2026 అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం ఇతివృత్తాలుగా పౌర వ్యవస్థను బలోపేతం చేస్తూ వితంతువుల మానవ హక్కులను సంరక్షించడం నిరంతరం కొనసాగాలి. వితంతువుల సామాజిక గౌరవం, న్యాయం, విద్య, ఆర్థిక భద్రత కల్పించడం మన కనీస కర్తవ్యం అని భావించాలి. దాతృత్వ పరిధులను దాటి వితంతువులకు సహకార సంఘాల ద్వారా ఆర్థిక చేయూత ఇవ్వడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. జనన మరణాలు ప్రకృతి నియమాలని కళ్లు తెరిచి భర్తలను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో మునిగిపోయిన వితంతువులను ప్రత్యేకంగా గౌరవించకపోయినా వారితో కూడిన సమ్మిళిత జీవన విధానాన్ని మనం పాటించాలి.

**వితంతువుల పట్ల ప్రపంచ స్థాయిలో వివక్ష :**

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 285 మిలియన్ల వితంతువులు ఉండగా అందులో 1.36 మిలియన్ల బాల్య వితంతువులు ఉన్నారు. నాడు సతీసహగమనం ఓ భయంకర దురాచారం. వైధవ్యం పొందిన దురదృష్టవంతుల్లో అధిక శాతం పేదలు ఉన్నట్లు అంచనా. అధిక సంఖ్యలో వితంతువులు ఆర్థిక సమస్యలు, సామాజిన నిరాదరణలు, అర్థరహిత వివక్షలు, విద్యకు దూరం చేయడం, ఆస్తి హక్కును కల్పించకపోవడం, ఆరోగ్య భద్రత లేకపోవడం, భూమిలో హక్కును లాగేసుకోవడం, శుభకార్యాల్లో నిషేధించడం, తెల్ల చీరలు మాత్రమే కట్టమని నిబంధనలు పెట్టడం, బొట్టు కాటును లాక్కోవడం, చేతి గాజులను నిషేధించడం, దుర్వినియోగాలు ఎదుర్కోవడం, అనువంశిక హక్కులను కల్పించకపోవడం, ఎవరినీ దీవించే హక్కును హరించివేయడం లాంటి అమానవీయ దురాచారాలు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి.

**భారతంలో వితంతువుల పట్ల తీవ్ర వివక్ష:**

నాడు చిన్నతనంలోనే పెళ్ళి పీలెక్కించి, ముక్కుపచ్చలారని వయసులోనే వితంతువులుగా మిగిలిన కథల వెతలు ఎన్నో. మూఢాచార విషవలయంలో చిక్కి విలవిల్లాడుతున్న వితంతువులది ఒడువని దుఃఖం, తీరని వైధవ్య భారం. భారత్‌లో అత్యధికంగా పాండిచ్చేరీ, పశ్చిమ బెంగాల్, ఏపీ రాష్ట్రాల్లో ఉండగా అత్యల్పంగా నాగాలాండ్, సిక్కింలలో ఉన్నారు. భారత వితంతువుల పట్ల సాంఘీక, ఆర్థిక, మానసిక వివక్షలు కొనసాగుతూనే ఉన్నాయి. వితంతువుల పట్ల కొన్ని కఠిన నియమనిబంధనలు విధిస్తూ, వితంతువుల జీవితాల్లో కారు చీకట్లు కమ్మడం జరుగుతోంది. సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడానికే కాకుండా పునర్వివాహం చేసుకోవడానికి సమాజం ఒప్పుకోవడం లేదు. వితంతువులు అపవిత్రులు, పౌర సమాజంలో అవమానాలు ఎదుర్కోవడం, దురదృష్టవంతులని ముద్ర వేసింది. వారసత్వ హక్కులను కాలరాస్తూ, తెర వెనుక నిలబడమని శాసిస్తున్నది నేటి అమానవీయ ఆధునిక సమాజం. బొట్టును చెరిపేయడం, తాళిని తెంపేయడం, తాళి మట్టెలను త్యాగం చేయడం, సిగలో పూదండలను నిషేధించడం, నలుగురితో తిరగకుండా నిర్భంధించడం, అందంగా కనబడడాన్ని ఓర్వకపోవడం, పసుపును నిషేధించడం, కొత్త దుస్తులు ధరించనివ్వకపోవడం, పండుగలకు దూరంగా పెట్టడం, ఆహార ఆంక్షలు విధించడం, చీదరించుకోవడం, వేట్టిచాకిరీ చేయించుకోవడం, కొన్ని వేళల్లో కోశాలను తొలగించడం, చీకటి గదిలో మగ్గిపోమ్మనడం, చేతి గాజుల్ని పగులగొట్టడం, దీవెనలు ఇవ్వవద్దంటూ శాసించడం లాంటి పలు అశాస్త్రీయ కట్టుబాట్లు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి.





**రాజారామ్ మోహన్ రాయ్, కందుకూరి వీరేశలింగం వారసులం కాలేమా !**

వితంతువులకు తమ పిల్లల్ని పెంచే గురుతర బాధ్యతలు ఉంటాయని, కుటుంబానికి పెద్దగా నిలబడి తన సత్తాను చాటుకోవాలని ప్రోత్సహించడం మన కనీస కర్తవ్యం. సామాజిక అవగాహన, ఆర్థిక స్వావలంభన, సామాజిక మద్దత్తులను కల్పిస్తూ వితంతువులను దేశాభివృద్ధిలో భాగం చేద్దాం, ఆమె నుదుట ధైర్యమనే బొట్టుపెట్టి ముందుకు సాగే విధంగా చర్యలు తీసుకుందాం. మనందరం రాజారామ్ మోహన్‌రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, కందుకూరి వీరేశలింగం పంతులు లాంటి వారసులమని రుజువు చేసుకోవడానికి వితంతువు పక్షపాతులుగా వారి జీవితాల్లో వెలుగుల్ని నింపుదాం, ఓ మహాద్భుత మహిళులుగా తీర్చిదిద్దుదాం.

వైధవ్యం ఓ శాపమని, వితంతువుల జీవితాలు నరక ద్వారాలనే నాటి భావనలను చెరిపేసి, విధవలను కూడా సాటి మహిళలుగా చూసుకుందాం, వారి ముఖాల్లో చిరునవ్వుల సింధూరాన్ని అలంకరిద్దాం. వైవిధ్యం పొందిన మహిళకు మేమున్నామనే భరోసా కల్పించడం మన కర్తవ్యం. వితంతువులు ధైర్యాన్ని కూడగట్టుకొని చాదస్తపు దురాచారాలను దూగడపడుతూ, పురుషాధిక్య సమాజంపై ధిక్కార స్వరం వినిపించాలి, అవసరమైతే అపర భద్రకాళులు కావాలి.



# కరీంనగర్ జిల్లా ప్రజలకు శుభవార్త




బ్యాడ్మింటన్ . టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు రంగంలో ఆసక్తిగలవారికి గంటకు 300 రూపాయల చొప్పున కోర్టును, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు ఆటకు ఇవ్వబడును. ముందస్తు బుకింగ్ చేసుకున్న వారికి ఇవ్వబడును బుకింగ్ చేసుకోవాల్సిన ఫోన్ నెంబర్ 9246966660

## ఆట వేళలు

ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు








మన కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా బ్యాడ్మింటన్. టేబుల్ టెన్నిస్ .క్యారం బోర్డు. చెస్. వంటి క్రీడలను ఇప్పుడు మన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో శిక్షణ ఇవ్వబడును. నిపుణులైన కోచులచే బ్యాడ్మింటన్. టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు వంటి క్రీడలలో శిక్షణ ఇవ్వబడును.కరీంనగర్ జిల్లా లోని విద్యార్థినీ విద్యార్థులను మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు నిపుణులైన కోచునులచే శిక్షణ ఇవ్వబడును.

ఆట వేళలు

ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు

ఇండోర్ స్టేడియం క్రీడాకారుల కోసం తెరిచి ఉంచబడును. కావున ఆసక్తిగల క్రీడాకారులు విద్యార్థిని విద్యార్థులు శిక్షణ కోసం మరియు ఆట ఆడుకునే అందుకోసం సంప్రదించవలసిన ఫోన్ నెంబర్.9246966660








జనచిత్రం

## ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించిన కరీంనగర్ చిన్నారి




**జనసైన్యం సిటి**

కరీంనగర్‌కు చెందిన ఐదేళ్ల చిన్నారి బొబ్బిలి నిధి శ్రీ పటేల్ అరుదైన ఘనతను సాధించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్--2026లో తన పేరును నమోదు చేసుకుంది.నిధి శ్రీ పటేల్ తల్లిదండ్రులు బొబ్బిలి రాజేంద్రప్రసాద్, ప్రత్యూష. ప్రస్తుతం ఆమె ఎక్స్‌ప్లోరికా స్కూల్లో 1వ తరగతి చదువుతోంది.నాలుగేళ్ల వయసులోనే తైక్వాండో సాధన ప్రారంభించిన నిధి, శిక్షణ మొదలైన మూడు నెలల్లోనే తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్‌లో పీ-వీ (Pee Wee) కేటగిరీలో రజత పతకం సాధించి తన ప్రతిభను చాటుకుంది.తాజాగా నిధి శ్రీ పటేల్ కేవలం ఒక నిమిషంలో 112 తైక్వాండో కిక్స్ ప్రదర్శించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. ఈ రికార్డు ఆమె కరీంనగర్‌కు చెందిన 2వ డాన్ బ్లాక్ బెల్ట్ తైక్వాండో కోచ్ రాకేష్ రెడ్డి పర్యవేక్షణలో నెలకొల్పడం విశేషం.అనంతరం నాలుగు ప్రాంతీయ స్థాయి పోటీల్లో పాల్గొని విశేష ప్రతిభ కనబరిచిన నిధి, చిన్న వయసులోనే క్రమశిక్షణ, ఏకాగ్రత, పట్టుదలతో ముందుకు సాగుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది.ఈ సందర్భంగా కోచ్ రాకేష్ రెడ్డి మాట్లాడుతూ, “ఆసక్తి, క్రమశిక్షణ, కఠోర శ్రమతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంటే చిన్న వయసులోనే గొప్ప విజయాలు సాధించవచ్చు. నిధి సాధించిన ఈ రికార్డు అందుకు నిదర్శనం” అని అన్నారు.
నిధి సాధించిన ఈ విజయంపై జిల్లా వ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తూ చిన్న వయసులోనే జాతీయ స్థాయి గుర్తింపు పొందడం కరీంనగర్ జిల్లాకు గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. తైక్వాండోలో అసాధారణ ప్రతిభ కనబరుస్తున్న నిధి శ్రీ పటేల్ భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి మరింత పేరు తీసుకురావాలని క్రీడా ప్రముఖులు ఆకాంక్షించారు.

## డోర్కాస్ కుట్టు శిక్షణ కేంద్రం తొలి పట్టభద్రుల వేడుక కుట్టుమిషన్ల పంపిణీ



**జనసైన్యం సిటి**

హార్వెస్ట్ మినిస్ట్రీస్, హైదరాబాద్ వారి మహిళా సాధికారత కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న డోర్కాస్ కుట్టు శిక్షణ కేంద్రం తొలి పట్టభద్రుల వేడుక ముల్కనూర్‌లో ఘనంగా జరిగింది.నాలుగు నెలల పాటు శిక్షణ పూర్తి చేసిన 10 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేయడంతో పాటు, ఒక్కోటి సుమారు రూ.12,000 విలువైన కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముల్కనూర్ సర్పంచ్ శ్రీమతి సాంబారి భరతమ్మ కొమురయ్య , పదవీ విరమణ పొందిన ఇంగ్లీష్ ప్రొఫెసర్ డా. ఉమా శాంత కుమార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీమతి సాంబారి భరతమ్మ కొమురయ్య గారు మాట్లాడుతూ, మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని, కుట్టు వృత్తి ద్వారా కుటుంబ ఆదాయాన్ని పెంచుకొని సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించుకోవాలని శిక్షణ పొందిన మహిళలకు సూచించారు.హార్వెస్ట్ మినిస్ట్రీస్ డైరెక్టర్ కాలేబు రాయపాటి ఆధ్వర్యంలో, కోఆర్డినేటర్ శ్రీధర్ సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. స్థానికంగా పాస్టర్ కొయ్యడ ఆశీర్వాదం విజయ ఆధ్వర్యంలో శిక్షణా కేంద్రం నిర్వహించబడగా, శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు మరియు కుట్టు మిషన్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పైడిపల్లి వెంకటేష్, వార్డు సభ్యులు గట్టు రేణుక, పందిపెల్లి కీర్తన, మాజీ ఉప సర్పంచ్ కయ్యం తిరుపతి తదితరులు పాల్గొని శిక్షణ పొందిన మహిళలను అభినందించారు.

## 99 రోజుల యాక్షన్ ప్లాన్ పనులను పరిశీలించిన జిల్లా స్పెషల్ ఆఫీసర్, కలెక్టర్



కొడిమ్యాల జన సైన్యం న్యూస్.

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక--99 రోజుల యాక్షన్ ప్లాన్ పనుల పర్యవేక్షణలో భాగంగా జిల్లా స్పెషల్ ఆఫీసర్ శ్రీమతి స్మితా పట్నాయక్, జిల్లా కలెక్టర్‌తో కలిసి సోమవారం కొడిమ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన అధికారులు అక్కడి సేవలను పరిశీలించారు.ఆసుపత్రిలో నిర్వహిస్తున్న రిజిస్టర్లు, వైద్య రికార్డులను తనిఖీ చేయడంతో పాటు వైద్యులు, సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించారు. ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు.ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు సమర్థవంతంగా చేరేలా అధికారులు కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలి

**జనసైన్యం సిటి**




పాఠశాల విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడి అరికట్టాలని, ఫీజుల నియంత్రం చట్టం అమలు చేయాలని , విద్యాహక్కు చట్టం -2009 ప్రకారం ప్రైవేట్ పాఠశాలలో పేదలకు25%సీట్లుఉచితంగా ఇవ్వాలని,27వేల ప్రభుత్వ పాఠశాలలను 4వేలకు తగ్గిస్తామని రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన వెనక్కి తీసుకొని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో హైదరాబాద్, లక్డికపూల్ పాఠశాల విద్యా కార్యాలయం ముందు ధర్నాకు టెలిఫోన్ భవన్ నుండి ర్యాలీ వెళ్లగా పోలీసులు అడ్డుకొని ధర్నా చేస్తున్న నాయకులను అరెస్ట్ చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్ కి తరలించారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి,పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు అక్షరాలతో లక్షల వ్యాపారం చేస్తూ, యాజమాన్యాలు పాఠశాలలను అంగడి కేంద్రాలుగా మార్చాయి.ఎల్కేజీ విద్యకు లక్ష నుండి నాలుగు లక్షల రూపాయల ఫీజు వసూలు చేస్తూ, పుస్తకాలు ,యూనిఫామ్, ఐడి కార్డ్,డైరీలు, అడ్మిషన్ ఫీజుల పేరిట మరో లక్ష రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నాయని ఏ ఒక్క పాఠశాల కూడా ఫీజుల నియంత్ర చట్టం అమలు చేయడం లేదని, విద్యా హక్కు చట్టం అమలు ఊసే లేకుండా పోతుందని, జిల్లా విద్యాశాఖ అధికారి ,మండల విద్యాశాఖ అధికారులు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు వత్తాసు పలుకుతూ వారు చేసే దోపిడీపై చర్యలు తీసుకోవడం లేదని, సీఎం రేవంత్ రెడ్డి వద్ద విద్యాశాఖ ఉన్న ఫీజుల దోపిడి అరికట్టడానికి కఠిన చట్టాల అమలు చేయడం లేదని, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తూ సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల ఒక చానల్ ఇంటర్వ్యూలో 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4000కు కుదిస్తామని మాట్లాడటం ప్రభుత్వ విద్య నిర్వీర్యం చేసే కుట్రఅని , రేవంత్ రెడ్డికి ప్రభుత్వ విద్య బలోపేతం పట్ల చిత్తశుద్ధి ఉంటే ఆరుట్లలో ప్రారంభం చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ లను రాష్ట్రమంతా నిర్మాణాలు చేయాలని , బిజెపి ఎమ్మెల్సీ పాఠశాల ప్రారంభోత్సవానికి పోయి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ప్రవేట్ విద్యా ప్రోత్సహించారని, రేవంత్ రెడ్డి తమిళనాడు మాదిరిగా తెలంగాణలో ఫీజుల దోపిడీ అరికట్టాలని, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల పై ఏసిబి ,ఐటి తనిఖీలు నిర్వహించి విద్యార్థుల తల్లితండ్రుల నుంచి అక్రమంగా వసూలు చేసిన సొమ్మును కక్కించాలని, రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దోపిడీపై ప్రత్యక్ష ఆందోళన చేస్తామని, అధికారులు స్పందించకుంటే వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకునేవిధంగా ఉద్యమిస్తామని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని మణికంఠ రెడ్డి ,పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు గ్యార నరేష్, బానోత్ రఘురాం, రెహమాన్, లెనిన్, రాష్ట్ర నాయకులు చైతన్య యాదవ్, అన్వర్, శాంతి కుమార్, దత్తు రెడ్డి, ఆకాష్ నాయక్, హరీష్ , అనిల్, అరుణ్, జోసెఫ్ భాను, అవినాష్, లోకేష్, నవీన్, విజయ్, శ్రీను, రాహుల్, లింగం, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

## తమ విద్యాసంస్థల అవినీతిని కప్పిపుచ్చుకున్నందుకే కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు

**జనసైన్యం సిటి**



. అధికార పార్టీకి చెందిన ప్రైవేట్ విద్యా సంస్థల చైర్మన్ ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్వహించే నీట్ పరీక్షలలో అవకతవకలు జరుగాయని దానికి బాధ్యులైన కేంద్ర మంత్రిపై విమర్శలు చేసిన ఆ చైర్మన్ కు కరీంనగర్ నిజామాబాద్ , హైదరాబాద్, అదిలాబాద్ , వరంగల్ జిల్లాలలో అనేక విద్యాసంస్థలు ఉన్నవి అలాంటి విద్యా సంస్థలలో విద్యార్థులకు ఎంత ఫీజులు వసూలు చేస్తున్నారు అలాగే విద్యార్థులను తల్లిదండ్రులను అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు మరి దానిని ఎందుకు బహిర్గతం చేయలేదని ఈరోజు కరీంనగర్ లో బీసీ సంఘాల కార్యాలయంలో బీసీ సంఘాల సమావేశంలో జిల్లా యువజన సంఘం నాయకులు మాదాసు సంజీవ్ అన్నారు ఈ సందర్భంగా మాదాసు సంజీవ్ మాట్లాడుతూ ఈ అధికార పార్టీకి చెందిన చైర్మన్ గారి యొక్క టెక్నో పాఠశాలలో కేవలం అడ్మిషన్ ఫీజు 25 వేల రూపాయలు వసూలు చేస్తున్నారు అలాగే ఇతర పాఠశాలలో ఇతర కళాశాలలో లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారు ఇలా పేద విద్యార్థులను తల్లిదండ్రులను దోచుకుంటున్న ఆ విద్యాసంస్థల చైర్మన్ నీట్ పరీక్ష పై మాట్లాడడం విడ్డూరం యొక్క విద్యాసంస్థల చైర్మన్ గతంలో ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేసినారు విద్యార్థులు తల్లిదండ్రులు నిరుద్యోగులు అందరు కలిసి గెలిపివ్వలేదు ఇలా ఇక్కడ కాకుండా వరంగల్ జిల్లాలో కూడా అక్కడ విద్యా సంస్థ చైర్మన్ కూడా అక్కడ నిరుద్యోగులు, విద్యార్థులు తల్లిదండ్రులు కూడా గెలిపించలేదు ఇలా విద్యాసంస్థల చైర్మన్ లకు రాజకీయాలకు అవకాశాలు ఇవ్వకూడదు విద్యార్థులనుతల్లిదండ్రులను పట్టిపీడించే విద్యాసంస్థల చైర్మన్ లకు ఎలాంటి పదవి ఇచ్చినా ఆ పార్టీకే నష్టం ఇలాంటి వారిని రాజకీయాలకు దూరంగా ఉంచాలని బీసీ సంఘాల పక్షానకోరుతున్నాం.గతంలో ఎలక్షన్లో పోటీ చేసిన అనంతరం ఆ యొక్క ఖర్చును విద్యార్థులను తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టుకుంటూ ఏకంగా వేలాది రూపాయల ఫీజులను పెంచడం జరిగింది ఇలా తల్లిదండ్రులను విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న ఈ విద్యా సంస్థలయాజమాన్యంపైవిద్యార్థులు తల్లిదండ్రులు తిరగబడాలని సమావేశం కోరింది అలాగే కేంద్ర ప్రభుత్వంపై విమర్శ చేసిన ఈ అధికార పార్టీకి చెందిన విద్యా సంస్థల చైర్మన్ యొక్క పాఠశాలల ఫీజులపై కళాశాల ఫీజులపై అక్రమ వసూళ్లపై కేంద్ర మంత్రులు దృష్టి పెట్టాలని సమావేశం కోరింది.ఈ అధికార పార్టీకి చెందిన విద్యా సంస్థల చైర్మన్ ప్రభుత్వాహనాన్ని ఉపయోగించుకొని తన భవన నిర్మాణానికి నిర్మాణ సామగ్రిని తెచ్చుకున్న విషయం బహిరంగమైంది దీనిపై ఎలాంటి విచారణ జరగలేదు. అలాగే ఈ విద్యాసంస్థలకు సంబంధించిన దానిపై త్వరలో ఇన్కమ్ టాక్స్ అధికారులకు ఫిర్యాదు చేయనున్నాం పేద విద్యార్థుల సొమ్మును పేద విద్యార్థులకు అందించేంతవరకు బలహీన వర్గాలను కలుపుకొని ఉద్యమిస్తామని సమావేశం హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ మరియు అనుబంధ సంఘాల నాయకులు ఎడ్ల సురేందర్ , దుప్పటపల్లి మురళి , వాయిల రాజ్ కుమార్ , చింటూ పటేల్ పోకల.విజయ్, సాయి కుమార్, చిట్టీమల్ల సాగర్, నరేష్, పూజిత,సరిత, లావణ్య, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



జగదీష్ కి జన్మదిన శుభాకాంక్షలు



విజయకు జన్మదిన శుభాకాంక్షలు



రాజేందర్ కు జన్మదిన శుభాకాంక్షలు

# అభివృద్ధి - పర్యావరణ పరిరక్షణ పరస్పర విరుద్ధ అంశాలా?



డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్



అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండూ మానవ సమాజానికి అత్యంత అవసరమైన అంశాలు. అయితే చాలా సందర్భాల్లో ఇవి ఒకదానికొకటి విరుద్ధంగా కనిపిస్తాయి. జనాభా పెరుగుదల, ఆహార అవసరాలు, పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, మౌలిక సదుపాయాల నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలు ప్రకృతి వనరులపై తీవ్రమైన ఒత్తిడిని సృష్టిస్తాయి. మరోవైపు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తే అభివృద్ధి వేగం తగ్గుతుందని కొందరు వాదిస్తారు. కానీ వాస్తవానికి అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ పరస్పర విరుద్ధ అంశాలు కావు. సరైన ప్రణాళిక, శాస్త్రీయ దృక్పథం, బాధ్యతాయుత విధానాలతో ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించవచ్చు.

జనాభా పెరుగుదలతో ఆహార అవసరాలు పెరుగుతాయి. అధిక దిగుబడుల కోసం అడవులను నరికి వ్యవసాయ భూములుగా మార్చడం జరుగుతుంది. ఉదాహరణకు అమెజాన్ అడవులలో పెద్ద ఎత్తున చెట్ల నరికివేత పశువుల పెంపకం, వ్యవసాయం కోసం జరిగింది. దీనివల్ల జీవ వైవిధ్యం దెబ్బతింది. అలాగే అధిక దిగుబడుల కోసం రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం పెరగడంతో నేల సారవంతత తగ్గడం, భూగర్భ జలాలు కలుషితం కావడం, మానవ ఆరోగ్య సమస్యలు పెరగడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి.

పారిశ్రామికీకరణ అభివృద్ధికి ప్రధాన చోదక శక్తి. పరిశ్రమలు ఉపాధి కల్పిస్తాయి, దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడతాయి. కానీ పరిశ్రమల నుంచి విడుదలయ్యే పొగ, విష వాయువులు, వ్యర్థాలు గాలి, నీరు, నేల కాలుష్యానికి కారణమవుతున్నాయి. భారతదేశంలోని అనేక పారిశ్రామిక ప్రాంతాల్లో నదులు కలుషితమయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి వల్ల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు పెరిగి వాతావరణ మార్పులకు దారి తీస్తున్నాయి.

పట్టణీకరణ కూడా ఇదే విధమైన సమస్యలను సృష్టిస్తోంది. నగరాల విస్తరణ కోసం చెరువులు, అడవులు, వ్యవసాయ భూములు ఆక్రమించబడుతున్నాయి. హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల్లో చెరువుల విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. ఫలితంగా వరదలు, నీటి కొరత వంటి సమస్యలు పెరిగాయి. భారీ భవనాలు, రహదారులు, వాహనాల సంఖ్య పెరగడం వల్ల గాలి కాలుష్యం తీవ్రమవుతోంది.

రవాణా రంగం అభివృద్ధికి కీలకం. అయితే పెట్రోల్, డీజిల్ వాహనాల వల్ల కార్బన్ ఉద్గారాలు పెరిగి గ్లోబల్ వార్మింగ్‌కు కారణమవుతున్నాయి. అలాగే భారీ ఆనకట్టలు సాగునీరు, విద్యుత్ అందించినప్పటికీ వేలాది మంది నిర్వాసితులు కావడం, అటవీ ప్రాంతాలు మునిగిపోవడం వంటి సమస్యలు ఏర్పడ్డాయి.

అభివృద్ధి పేరుతో ప్రకృతిని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తే దాని ఫలితాలు తీవ్రమైనవిగా ఉంటాయి. వాతావరణ మార్పులు, అనియంత్రిత వర్షాలు, కరువులు, వరదలు, ఉష్ణోగ్రతల పెరుగుదల, జీవ వైవిధ్య నష్టం వంటి సమస్యలు చివరకు ఆర్థికాభివృద్ధినే దెబ్బతీస్తాయి. అందువల్ల పర్యావరణాన్ని కాపాడకుండా అభివృద్ధి సాధించడం అసాధ్యం.

ఈ నేపథ్యంలో సుస్థిర అభివృద్ధి (సస్టైనబుల్ డెవలప్మెంట్ ) భావన అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. అంటే ప్రస్తుత తరాల అవసరాలను తీర్చేటప్పుడు భవిష్యత్ తరాల అవసరాలకు భంగం కలగకుండా అభివృద్ధి చేయడం.

దీనికి కొన్ని ముఖ్యమైన పరిష్కారాలు:

అడవుల నరికివేతకు బదులుగా భారీ స్థాయిలో మొక్కలను నాటే కార్యక్రమాలు చేపట్టాలి. ఉన్న వృక్షాల సంరక్షణ చేపట్టాలి. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. నీటి సంరక్షణ పద్ధతులు, సూక్ష్మ నీటిపారుదల విధానాలను విస్తరించాలి. పరిశ్రమల్లో కాలుష్య నియంత్రణ సాంకేతికతలను తప్పనిసరి చేయాలి. బొగ్గు, చమురు ఆధారిత విద్యుత్‌కు బదులుగా సౌర, పవన, జల, బయోగ్యాస్ వంటి పునరుత్పాదక ఇంధన వనరులను విస్తరించాలి. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేసి విద్యుత్ వాహనాలను ప్రోత్సహించాలి. నగరాల్లో చెరువులు, పార్కులు, హరిత ప్రాంతాలను పరిరక్షించాలి.

ప్రతి పెద్ద ప్రాజెక్టులకు కఠినమైన పర్యావరణ ప్రభావ అంచనా (ఎన్విరాన్మెంటల్ ఇంపాక్ట్ ఎస్సెమ్మెంట్ ) నిర్వహించాలి. “రెడ్యూస్, రీ యూస్, రీ సైకిల్ “ సూత్రాలను ప్రజల జీవనశైలిలో భాగం చేయాలి. పర్యావరణ విద్యను పాఠశాల స్థాయి నుంచే బలోపేతం చేయాలి.

అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సంఘర్షణ అనివార్యం కాదు. ప్రకృతిని నాశనం చేస్తే అభివృద్ధి చివరికి మనుగడకే ముప్పుగా మారుతుంది. అదే సమయంలో అభివృద్ధిని పూర్తిగా నిరాకరించడం కూడా సాధ్యం కాదు. కాబట్టి ప్రకృతిని భాగస్వామిగా భావిస్తూ, శాస్త్రీయ ప్రణాళికతో, బాధ్యతాయుత వినియోగంతో, సుస్థిర అభివృద్ధి మార్గంలో ముందుకు సాగితేనే ఆర్థిక ప్రగతి, సామాజిక సంక్షేమం, పర్యావరణ సమతుల్యత ఒకేసారి సాధ్యమవుతాయి. అభివృద్ధి అలాగే పర్యావరణ పరిరక్షణ పరస్పర విరుద్ధ అంశాలు కావు; అవి ఒకే రథానికి రెండు చక్రాలు. ఒకటి లేకుండా మరొకటి దీర్ఘకాలం నిలవదు.

## రెండు కుటుంబాలని కుదిపేసిన రోడ్డు ప్రమాదాలు





**జనసైన్యం సిటి**

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో రెండు యువజంటల దుర్మరణం.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర కాలనీలో భార్య సంధ్య(22), పెద్ద కొడుకు రుత్విక్(7), మోక్షిత్(2)లతో కలిసి నివాసం ఉంటున్న సాయిప్రకాశ్(25) అనే వ్యక్తి .ఇటీవల తండ్రి మరణించగా, తల్లి జ్యోతి, భార్య సంధ్య, చిన్న కొడుకు మోక్షిత్‌లతో కలిసి హైదరాబాద్ నుండి ములకలపల్లిలోని బంధువుల ఇంటికి నిద్ర చేసేందుకు వెళ్ళిన సాయిప్రకాశ్.బంధువుల ఇంటి నుండి తిరిగి వస్తుండగా, అదుపుతప్పి మాధారం అటవీ ప్రాంతంలో చెట్టును ఢీకొని సాయిప్రకాశ్, సంధ్య, మోక్షిత్ అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తల్లి జ్యోతి.మరోవైపు 8 నెలలు క్రితం ప్రేమ వివాహం చేసుకుని సిద్దిపేట జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మరో యువజంట.హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ ముంబైకి చెందిన దీక్షిత(25) అనే యువతిని ఎనిమిది నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్న మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన మహేందర్(28) అనే యువకుడు.భార్యతో కలిసి హైదరాబాద్ నుండి బండిపై స్వగ్రామానికి వెళ్తుండగా సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం లకుడారం వద్ద ముందు వెళ్తూ ఒక్కసారిగా సడన్ బ్రేక్ వేసిన ట్రాక్టర్‌ను బలంగా ఢీకొట్టిన మహేందర్ .ట్రాక్టర్ వెనుక భాగంలో ఉన్న కేజ్ వీల్స్ తగిలి మహేందర్ అక్కడికక్కడే మృతిచెందగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన దీక్షిత.

## మాజీ కౌన్సిలర్ రాచకొండ తిరుపతి గౌడ్‌ను పరామర్శించిన యాదగిరి సునీల్ రావు



**జనసైన్యం సిటి**

నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, మాజీ కౌన్సిలర్ రాచకొండ తిరుపతి గౌడ్ గారు అనారోగ్యానికి గురై ఆదర్శ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ మరియు మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు గారు ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు.

ఈ సందర్భంగా తిరుపతి గౌడ్ గారి ఆరోగ్య పరిస్థితిని మరియు అందుతున్న వైద్య సహాయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు

## ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటానికి పాలాభిషేకం

కొడిమ్యాల జనసైన్యం న్యూస్.

కొడిమ్యాల మండల అభివృద్ధికి గాను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రూ.2 కోట్ల నిధులను మంజూరు చేసిన సందర్భంగా సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోగూరి నాగభూషణ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మండల అభివృద్ధికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక చొరవ చూపుతూ నిధులు మంజూరు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు.మండల ప్రజల తరఫున ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి, సీనియర్ నాయకులు మల్లికార్జున్ రెడ్డి, నారాయణ, తిరుపతి రెడ్డి, ముత్యం రెడ్డి, కంబల్ల రాజమల్లు, అజయ్, కొండూరి రాజేష్, ముమ్మాడి స్వామి అనుమండ్ల అజయ్ రెడ్డి (లడ్డు), నేరెళ్ల మహేష్, పర్లపల్లి ప్రసాద్, సింగిరెడ్డి వినోద్ రెడ్డి, గాజుల అజయ్ గౌడ్, నజీర్, ప్రసాద్. మల్లారపు రమేష్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఇసుక మాఫియా అక్రమాలకు బలైన నిండు ప్రాణం



**జనసైన్యం సిటి**

అంబులెన్స్‌కు సైతం దారి. ఇవ్వకుండా రహదారిపై అడ్డంగా నిలిపిన లారీలు.భుజంపై రోగిని మోసుకెళ్లిన కుటుంబ సభ్యులు .భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మణుగూరు మండలం సాంబాయిగూడెం నుండి రామానుజవరం వరకు రహదారిపై అడ్డంగా నిలిపిన ఇసుక లారీలు.అదే మార్గంలో మణుగూరు మండలం దమ్మక్కపేట గ్రామంలో పురుగుల మందు తాగిన వంశీ(35) అనే వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తుండగా, కనీసం అంబులెన్స్‌కు కూడా దారి ఇవ్వని ఇసుక లారీలు .భుజంపై మోసుకుని వెళ్ళే సరికి ప్రాణాలు కోల్పోయిన వంశీ.ఇసుక లారీలు రోడ్డును బ్లాక్ చేయడంతోనే వంశీ మృతి చెందాడని ఆవేదన వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు.

## ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటర్ల పాత్ర కీలకం




**జనసైన్యం సిటి**

ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటర్ల పాత్ర అత్యంత కీలకమని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలోని సాయిరాం గార్డెన్‌లో సోమవారం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై బీఎల్ఓ,సూపర్ వైజర్లకు నిర్వహించి అవగాహన శిబిరానికి ఆయన ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఓటు దేశ భవిష్యత్తును నిర్ణయించే శక్తిని కలిగి ఉంటుందని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఖచ్చితమైన ఓటర్ల జాబితా ఎంతో అవసరమని అన్నారు.ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు చేసుకోవడం ఎంత ముఖ్యమో, జాబితాలోని అర్హులైన వారి పేర్లు తొలగింపునకు గురి కాకుండా చూసుకోవడం అంతే ముఖ్యమన్నారు. కేంద్ర చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఓటర్ల పేర్లు జాబితా నుంచి అక్రమంగా తొలగింపునకు గురి కాకుండా చూడాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాలో పేర్లు లేకపోవడం, తప్పులు ఉండటం లేదా చిరునామా మార్పులు వంటి పొరపాట్లను వెంటనే సవరించుకోవాలని ఆయన సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడూతూ ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేయించుకోవడం, మార్పులు, చేర్పులు, తొలగింపులు వంటి అంశాలకు సంబంధించి ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. సర్ విధులు నిర్వహించే అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

ఈ శిబిరంలో తహసీల్దార్లు కర్ర శ్రీనివాస్ రెడ్డి(తిమ్మాపూర్), ఇప్ప నరేందర్ (గన్నేరువరం), సురేష్ (ఇల్లంతకుంట), శ్రీకాంత్ (బెజ్జంకి), విజయ్ కుమార్ (మానకొండూర్), కొత్తపల్లి గ్రామ సర్పంచ్ గోదారి శోభారాణితోపాటు పలువురు ఆర్ఐలు పాల్గొన్నారు.

## పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేసిన నగర మేయర్ కోలగాని శ్రీనివాస్

**జనసైన్యం సిటి**

కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా 27వ డివిజన్ అంబేద్కర్ నగర్‌లో రూ.6.5 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న తాగునీటి పైప్‌లైన్ పనులకు నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగర ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రతి డివిజన్‌లో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను ప్రాధాన్యత ఆధారంగా చేపడుతూ, తాగునీటి సరఫరా, రహదారులు, డ్రైనేజీలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు.అంబేద్కర్ నగర్ ప్రాంత ప్రజలకు తాగునీటి సరఫరా మరింత మెరుగుపడేలా ఈ పైప్‌లైన్ పనులు ఉపయోగపడతాయని, పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో 27వ డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి బొట్ల శ్యామల కిరణ్, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.



## రాజకీయంగా ఎదుర్కోలేకే ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌పై దుష్ప్రచారం!



**జనసైన్యం సిటి**

ప్రజాస్వామ్యలో రాజకీయంగా ఎదుర్కోలేకనే తమ నాయకుడు రాష్ట్ర ప్రభుత్వ విప్,కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏకైక మున్నూరు కాపు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పై కొందరు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్ మధు మండిపడ్డారు.ప్రజల్లో ఆది శ్రీనివాస్ పై రోజురోజుకు పెరుగుతున్న ఆదరణను జీర్ణించుకోలేక రాజకీయ ప్రత్యర్థులు నిరాధార ఆరోపణలకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు.ఒక సామాన్య కుటుంబం నుంచి రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆది శ్రీనివాస్ తన కష్టంతో,ప్రజల సమస్యలపై నిరంతర పోరాటంతో ఈ స్థాయికి ఎదిగారని పేర్కొన్నారు.ఎలాంటి రాజకీయ వారసత్వం లేకుండా,డబ్బు,అధికార అండదండలు లేకుండా ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్న నాయకుడిగా ఆయన మహోన్నతమైన గుర్తింపు పొందారని అన్నారు.ఇటీవల వెలుగులోకి వచ్చిన ధాన్యం అక్రమ రవాణా కేసును అడ్డం పెట్టుకుని కొందరు కావాలనే ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేరును వివాదంలోకి లాగేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.ధాన్యం కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తికి సంబంధించిన కుటుంబ సభ్యుడు కాంగ్రెస్ నాయకుడు కావడమే తప్ప,ఆది శ్రీనివాస్‌కు ఆ వ్యవహారంతో ఎలాంటి సంబంధం లేదని వారు స్పష్టం చేశారు.అయినప్పటికీ ఆయన ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతో కొందరు అసత్య ప్రచారానికి దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.”చట్టం ముందు అందరూ సమానమే.ఎవరైనా తప్పు చేసి ఉంటే దర్యాప్తు సంస్థలు,న్యాయవ్యవస్థ తమ పని తాము చేసుకుంటాయి.కానీ ఎలాంటి ఆధారాలు లేకుండా ప్రజా ప్రతినిధులను కేసులతో ముడిపెట్టడం రాజకీయ నీచ సంస్కృతికి నిదర్శనం” అని మధు ధ్వజమెత్తారు.ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌పై జరుగుతున్న ఈ దుష్ప్రచారం ప్రజల్లో ఏమాత్రం ప్రభావం చూపదని వారు ధీమా వ్యక్తం చేశారు.రాజకీయ ప్రత్యర్థులు అసత్యాలను ఎంతగా ప్రచారం చేసినా అవి సత్యాలుగా మారవని,చివరకు నిజమే గెలుస్తుందని స్పష్టం చేశారు.బీసీ వర్గాలకు చెందిన యువ నాయకుడిగా ఆది శ్రీనివాస్ సాధించిన రాజకీయ ప్రాధాన్యత కొందరికి అసహనంగా మారిందని,అందుకే వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని ఆరోపించారు.ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని,అభివృద్ధి,ప్రజా సేవలతో ముందుకు సాగుతున్న తమ నాయకుడిపై చేస్తున్న కుట్రలను అదే స్థాయిలో తిప్పికొడతామని పేర్కొన్నారు.”రాజకీయంగా ఎదుర్కోలేని వారు తప్పుడు ప్రచారాలు,వ్యక్తిగత దాడులు మానుకుని ప్రజా సమస్యలపై పోటీ పడాలనీ,ప్రజల తీర్పే అంతిమమని మధు స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌పై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ప్రజాస్వామ్యవాదులు,బీసీ సంఘాలు,కాంగ్రెస్ కార్యకర్తలు తీవ్రంగా ఖండిస్తూ మీడియా,సోషల్ మీడియా వేదికల్లో వస్తున్న నిరాధార కథనాలను ప్రజలు నమ్మవద్దని వారు విజ్ఞప్తి చేశారు.

## రహీంఖాన్పేట్ గ్రామంలో ఆదర్శ పాఠశాలలో నా కోటింగ్ డ్రగ్స్ నివారణ కార్యక్రమం



**జనసైన్యం సిటి**

ఇల్లంతకుంట మండలం రహీంఖాన్పేట్ గ్రామంలో గల ు G M S రహీంఖాన్ పేట్ ఆదర్శ పాఠశాలలో నా కోటింగ్ డ్రగ్స్ నివారణ కార్యక్రమాన్ని ఇల్లంతకుంట ఎస్సై సిరిసిల్ల అశోక్ గారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సై గారు మాట్లాడుతూ డ్రగ్స్ వాడడం వల్ల కలిగే దుష్పరిణామాలను విద్యార్థులకు తెలియజేశారు ఎక్కువగా 16 సంవత్సరాలు పైబడిన విద్యార్థులు మరియు యువత ఈ డ్రగ్స్ బారిన పడుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులను డ్రగ్స్ కు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ఎవరైనా చుట్టుపక్కల డ్రగ్స్ తీసుకున్నట్లు అనుమానం వస్తే 1908కు కాల్ చేసి తెలియజేయాలన్నారు. అదేవిధంగా విద్యార్థులు మెయిల్ ద్వారా కూడా సమాచారం ఇవ్వవచ్చని,అలా ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలియజేశారు.డ్రగ్స్ నివారణపై ప్రతిజ్ఞ కూడా చేయించారు. ఇట్టి కార్యక్రమంలో రహీంఖాన్పేట్ గ్రామ సర్పంచ్,వార్డ్ మెంబర్లు, ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆపదలో ముగ్గురి రక్తదానం




**జనసైన్యం సిటి**

కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన ఆసరా ఫౌండేషన్ (ఆపదలో సహాయానికి రా) ఆధ్వర్యంలో ఆపదలో మహిళకి రక్తం అవసరం కాగా ఆదుకున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మరియు ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ రాపోలు గోపి కృష్ణ తెలిపారు. మంచిర్యాల్ జిల్లా కేంద్రానికి చెందిన మహిళ అనారోగ్యంతో స్థానిక వన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆపరేషన్ నిమిత్తం మూడు యూనిట్ల “ఏ” పాజిటివ్ రక్తం అవసరమై ఆసరా ఫౌండేషన్ ను సంప్రదించగా సంస్థ సభ్యులు పవన్ కుమార్, అజయ్, మరియు వివేక్ లు మహిళకి రక్తదానం చేసి ఆదుకున్నారు. ఈ సందర్భంగా ప్రాణదాతలుగా నిలిచిన రక్తదాతలను ఆసరా ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ ఆర్. గోపి కృష్ణ సభ్యులు కె. ప్రవీణ్, జి. తిరుపతి, ఎం. రవి చందర్, ఎస్. నిఖిల్, వి. అద్వైత్ తదితరులు అభినందించారు.

## ఘనంగా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ 87వ వ్యవస్థాపక దినోత్సవం



జనసైన్యం సిటి

కరీంనగర్ (సుభాష్ నగర్): కరీంనగర్ లోని సుభాష్ నగర్ లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (AIFB) 87వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు సోమవారం నాడు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ కార్పొరేషన్ 27వ డివిజన్ స్థానిక కార్పొరేటర్ బోట్ల శ్యామల, తంగేళ్ల కిరణ్ కుమార్ లతో కలిసి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ ముఖ్య అతిథిగా విచ్చేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అక్కడ ఉన్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి ఒకరికొకరు వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. శుభాష్ నగర్ లోని ప్రభుత్వ స్కూల్ లో విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడుతూ.. బలమైన, ఐక్యమైన, మరియు స్వయం సమృద్ధమైన భారతదేశాన్ని నిర్మించాలనే మహా సంకల్పంతో క్రాంతి వీరుడు నేతాజీ సుభాష్ చంద్ర బోస్ స్థాపించిన ‘ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్’ నేటికి 87 వసంతాలు పూర్తి చేసుకోవడం ప్రతి ఒక్కరికీ గర్వకారణమన్నారు. పేద ప్రజల పక్షాన పోరాటాలు: రాబోయే రోజుల్లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలు, స్ఫూర్తితో సమాజంలో జరుగుతున్న అవినీతి, అన్యాయాలకు వ్యతిరేకంగా పేద ప్రజల పక్షాన నిలబడి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. 87 ఏళ్ల నిరంతర శ్రమ: గడిచిన 87 ఏళ్లుగా AIFB పార్టీ జాతీయవాదం, సామాజిక న్యాయం, లౌకికవాదం మరియు సామాన్య ప్రజల సాధికారత కోసం, ప్రజల హక్కుల కోసం నిరంతరం క్షేత్రస్థాయిలో పోరాడుతోందని గుర్తు చేశారు.

యువతకు నేతాజీ స్ఫూర్తి: “నన్ను రక్తాన్ని అడగండి, నేను మీకు స్వేచ్ఛను ఇస్తాను!” అన్న నేతాజీ గర్జన నేటి యువతలో నరనరాల్లో ప్రవహించాలి. దేశ స్వాతంత్ర్య ఫలాలు సమాజంలో చివరి వరుసలో ఉన్న పేదవాడికి అందినప్పుడే నేతాజీ కలలుగన్న నిజమైన భారతదేశం సాకారమవుతుందని స్పష్టం చేశారు.

నవభారత నిర్మాణం: సమాజంలో ఉన్న అసమానతలపై, అన్యాయాలపై ప్రశ్నించే తత్వమే నేతాజీ మార్గమని, కుల మత బేధాలకు అతీతంగా ప్రగతిశీల నవ భారత నిర్మాణం కోసం యువత అంతా ఏకమై భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

“ఏకం అవ్వండి! పోరాడండి! నేతాజీ మార్గంలో భారతదేశాన్ని పునర్నిర్మించండి!” జై హింద్!

కార్యక్రమంలో పాల్గొన్న వారు:ఈ వేడుకల్లో 27వ డివిజన్ కార్పొరేటర్ బోట్ల శ్యామల, తంగేళ్ల కిరణ్ కుమార్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సత్యారావు, బద్రినేత, ఖాxూదీ విద్యార్థి సంఘం నాయకులు అతికం రాజశేఖర్ గౌడ్, గూడా కిష్టయ్య, రాహుల్ , సజ్జు, సాగర్ బాబాన్ మరియు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



జనసైన్యం సిటి

ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టల్లో నెలకొన్నా సమస్యలను పరిష్కరించాలని అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్టళ్లకు కు పక్కాభవనాలు నిర్మించాలని ఏఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా అదన కలెక్టర్ అశ్విని తానాజీ గారికి వినతి పత్రంఅందజేయడం జరిగింది .. ఈ సందర్భంగాాxాఖీ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ మాట్లాడుతూ.. సంక్షేమ హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని, అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్టళ్లకు పక్క భవనాలు నిర్మించాలని, దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి హాస్టల్లో అవకాశం కల్పించాలని , ఉత్తర తెలంగాణకు కరీంనగర్ ప్రధాన విద్యా కేంద్రంగా మారుతోందని, చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల నుండి వేలాది మంది విద్యార్థులు ఇక్కడికి వస్తున్నారని తెలిపారు. అయితే, తగిన హాస్టల్ వసతులు లేకపోవడం వల్ల పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమై వెనుతిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం నడుస్తున్న హాస్టళ్లలో గదులు సరిపోక వందలాది మంది విద్యార్థులు తీవ్ర ఇరుకుగా, నానా ఇబ్బందులు పడుతూ గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వ హాస్టళ్లలో సీటు దొరకని ఎస్సీ, పేద విద్యార్థులు ప్రైవేట్ రూమ్‌లు, హాస్టళ్లలో ఉంటూ నెలకు వేల రూపాయల అద్దెలు భరించలేక ఆర్థిక భారం మోస్తున్నారని, కొందరు చదువులను కూడా మధ్యలోనే ఆపేసే పరిస్థితి వస్తోందని పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాలుగా నూతన హాస్టళ్లు ఏర్పాటు చేస్తామని అధికారులు కేవలం మాటలకే పరిమితమయ్యారని, క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు.సమస్య తీవ్రతను పరిగణనలోకి తీసుకుని, ప్రస్తుతం మూతపడి ఉన్న ప్రీ-మెట్రిక్ హాస్టల్ భవనాలను పోస్ట్-మెట్రిక్ హాస్టళ్లుగా మార్చి రాబోయే విద్యా సంవత్సరం ప్రారంభం లోపే నూతన కళాశాల హాస్టల్‌ను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ అడ్లూరి లక్ష్మణ్ గారు ఇప్పటివరకు సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలపై స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా మంత్రి, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నూతన ఎస్సీ హాస్టళ్లను ప్రారంభించకపోతే.. మంత్రి నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాస్ నాయక్, నగర ఉపాధ్యక్షుడు కసిరెడ్డి సందీప్ రెడ్డి నగర సహాయ కార్యదర్శి బోయినీ విష్ణు పాల్గొన్నారు.



మొగిలి జీవిత దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు

# ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి




కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస వసతులు కల్పించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డిమాండ్ చేశారు. సోమవారం రోజున సిపిఎం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాంనగర్ లోని ప్రభుత్వ ప్రాథమిక మరియు ఉన్నత పాఠశాలలను సందర్శించి, ఉపాధ్యాయులను విద్యార్థులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ ...ప్రాథమిక, ఉన్నత పాఠశాల ప్రాంగణంలో వర్షం పడితే నీరు నిల్వ ఉండి చెరువును తలపిస్తుందని, శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులు 4 ఎస్జిటి పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అటెండర్ పోస్టు ఖాళీగా ఉందని, ఉన్నత పాఠశాలలో మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయని అటెండర్ లేదన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేటికి పోస్టులు భర్తీ చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు.విద్యార్థులకు సరిపడా అదనంగా రెండు క్లాస్ రూమ్ లో నిర్మించాలని, శిథిలావస్థలో ఉన్న రెండు రూములను ఆధునికరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వాటర్ సరిపడా సరఫరా చేయాలని, గతంలో వేసిన బోర్ వెల్ ఎందుకు పనికి రాకుండా పోయిందని వెంటనే కొత్త బోర్వెల్ వేసి విద్యార్థుల కు సరిపడా నీటి సౌకర్యం కల్పించాలన్నారు. పెద్ద పెద్ద చెట్లు క్లాస్ రూమ్ల పైకి రావడం గాలి దుమారం వస్తే పెద్ద ఎత్తున ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదు అన్నారు. వెంటనే ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం కోసం ఏర్పాటు చేసిన రెండు రేకుల షెడ్లు విరిగిపోయి శిథిలావస్థకు చేరుకున్నాయని వెంటనే రెండు రేకుల షెడ్లను ఆధునికరించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ బడుల్లో పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులే చదువుతున్నారని, వారికి కనీస మౌలిక వసతులు కల్పించాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యను పేదలకు అందకుండా కుట్రలు చేస్తున్నాయన్నారు. తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు నిర్దేశించబడుతుందన్న స్ఫూర్తిని పాలకులు విస్మరిస్తున్నారన్నారుఒకవైపు ప్రభుత్వ విద్యను పేద విద్యార్థులకు అందకుండా చేస్తూ ప్రైవేటు విద్యాసంస్థలను ప్రోత్సహిస్తూ చదువులు కొనుక్కునే పరిస్థితినీ పాలకులు తీసుకొచ్చారని ఎద్దేవా చేశారు.ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు పుల్లెల మల్లయ్య, డి నరేష్, శ్రీకాంత్, సూర్య, అరవింద్, భాస్కర్ ఇస్సాక్, ఆకాష్, సన్నీ, అక్షయ్, తదితరులు పాల్గొన్నారు

# ఓ మనిషి నీ అలవాట్లే ఉన్నత శిఖరాలకు బాట



ఓ మనిషి నీఅలవాట్లే నిన్ను
ఉన్నత స్థానంలో నిలుపుతాయి
వేకువనే మేల్కోవడం
మెరుగైన జీవనశైలి
సునిశిత పరిశీలన
దైనందిన పనులపై దృష్టి
ప్రణాళిక బద్ధంగా
పనులు చేయడం
నిర్ణీత కాలంలో
నిర్దేశిత కార్యాలను
పూర్తిచేసే క్రమశిక్షణ
ఉన్నత జీవితానికి
మొదటి మెట్టుకావాలి
ఓ మనిషి నీవు ఎంపిక
చేసుకున్న రంగంలో
పట్టుదలే పెట్టుబడిగా
క్రమం తప్పకుండా సాగే
నిత్య సాధన
నీలో నైపుణ్యానికి
ఆలంబన కావాలి
నీలో ఉత్పాదక శక్తి
సామర్థ్యాలు పెరిగి
ప్రగతి పురోగతి
సిద్ధించి విజయం
నీకు దాసోహమంటుంది
నీ గమ్యం వైపు సాగే పరుగు
ఈ రోజు నీవు చేసే చిన్న పని
రేపు నిన్ను విజేతగా నిలబెట్టే
పెద్ద గెలుపు కావాలి
లక్ష్యసాధనకు నీవు వేసే
అడుగు రేపటి అభివృద్ధికి
వేసే తొలి పునాది కావాలి
మంచి మాటలు మంచి అలవాట్లు
కర్తవ్యనిష్ట సంకల్పబలం
సోమరి తనం వీడి శ్రమిస్తే
నీ నీడ కూడా నిన్ను
మెచ్చుకుంటుంది
లక్ష్య సాధనా సామర్థ్యాలు
మనిషి వ్యక్తిత్వం మర్యాద
ఉన్నత స్థాయిలో రాణించటానికి
దశ దిశను నిర్ణయిస్తాయి
వృక్షోరక్షితి రక్షితః అన్నట్లు
నీ కర్తవ్య నిష్ట కార్యకుశలత
నిన్ను కాపాడుతుంది
నీనీతి నిజాయితీ
నీ జీవనశైలి నీ వైఖరి
క్రమశిక్షణ నిలకడైన అలవాట్లు
నీభవితను మార్చేదివ్యౌషధం
క్రమశిక్షణే నీఊపిరైతే టైం
నీకు దాసోహమంటుంది
నిండు కుండ తొణకదన్నట్లు
నిలకడగా సాగే నీఅలవాట్లే
నిన్ను సమాజంలో శక్తిగా
నిలుపుతాయి
శ్రమయేవజయతే
నీ జీవన శైలి అవుతే కష్టాల
పర్వతం కరిగిపోతుంది
కాలం విలువను తెలిసినవాడు
లోకంలో ఎన్నటికి ఓడిపోడు
చదువు అనేది ఒక నిరంతర
యజ్ఞం విజ్ఞానం వికాసం
వివేకం విచక్షణ విశ్లేషణ
సామర్థ్యాలను పెంచుతుంది
పుస్తకం తెరిస్తే జ్ఞానం వచ్చును
ప్రశ్నించే తత్వమే ప్రగతి నిచ్చును
విద్యను మించిన ధనం లేదు.
దాని దొంగిలించే శత్రువులేదు
క్రమం తప్పని సాధన ఉంటే
లక్ష్యం నీవషమౌతుంది
ఆలస్యం అనే జబ్బునువదిలితే
గమ్యం నిన్నువెతుక్కుంటూ వస్తుంది
సమయపాలనను నువ్వు
నమ్ముతే ఈ జగత్తు నీకు
దాసోహం అంటుంది
చెడును వదిలి మంచిని
పెంచితేసమాజం నీకు
నీరాజనం పడుతుంది
అలవాట్లే నీ క్యారెక్టర్ (వ్యక్తిత్వం)
అవేనీజీవితానికి కండక్టర్
మంచిని నెమరువేస్తూ
సాగిపోతే విజయం సిద్ధిస్తుంది
పరిస్థితులు ఎలా ఉన్నా
నీమంచి అలవాట్లుమారవద్దు
కష్టాలు ఎన్ని వచ్చినా
నీఆశయం వీడొద్దు
ఆశయాల సాధనలో
అలుపెరుగని పోరాటం చేసిన
మహనీయలే చరిత్ర నిర్మాతలైనారు
నీ అలవాట్లే నీ వ్యక్తిత్వానికి
ఆభరణాలు
నీఅలవాట్లే నీకుబలం
అవే నిన్ను ఉన్నత
శిఖరాలకు చేర్చుతాయి
మెరుగైన అలవాట్లతో
మెరుగైన సమాజ నిర్మాణానికి
పౌరసమాజం పూనుకోవాలి

నేదునూరి కనకయ్య

# ప్రైవేట్ కాలేజీల ఆర్థిక దోపిడీని అరికట్టాలి




**జనసైన్యం సిటి**

డీవైఎఫ్ఐ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న ఆర్థిక దోపిడీని అరికట్టాలని, అకాడమీ పేర్లతో విద్యార్థులను మరియు వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్న సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (DIEO) కార్యాలయం ముందు భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. నరేష్ పటేల్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల కొరత, మౌలిక వసతుల లేమి, తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నిచర్ వంటి సమస్యలు విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు.అలాగే జిల్లాలోని అనేక ప్రైవేట్ జూనియర్ కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నాయని అన్నారు. అడ్మిషన్ ఫీజులు, ప్రత్యేక ఫీజుల పేరుతో వేలాది రూపాయలు వసూలు చేయడం దారుణమని విమర్శించారు.కొన్ని ప్రైవేట్ కళాశాలలు ఒకచోట అడ్మిషన్లు నిర్వహించి, మరో కాలేజీలో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులను గందరగోళానికి గురిచేస్తున్నాయని తెలిపారు. అంతేకాకుండా, కాలేజీ నచ్చకపోతే ఫీజులు తిరిగి చెల్లిస్తాం

అంటూ మాయమాటలు చెప్పి డబ్బులు వసూలు చేసి, అనంతరం వాటిని తిరిగి ఇవ్వకుండా మోసం చేస్తున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి కళాశాలలపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జిల్లాలో కొన్ని ప్రైవేట్ కళాశాలలు డిఫెన్స్ కోచింగ్,ఎన్డీఏ శిక్షణ" పేర్లతో విద్యార్థులను ఆకర్షిస్తూ తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని నరేష్ పటేల్ ఆరోపించారు. సరైన అనుమతులు, అర్హత కలిగిన అధ్యాపకులు, అవసరమైన మౌలిక వసతులు లేకుండానే డిఫెన్స్ శిక్షణ పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్న కళాశాలలపై సంబంధిత అధికారులు వెంటనే సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అకాడమీ పేర్లతో కొన్ని సంస్థలు తప్పుడు ప్రచారాలు చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో సరైన అనుమతులు లేకుండా నిర్వహించబడుతున్న ఆకాశ్, కోట, గ్రావిటీ, బన్సల్, ర్యాంక్ ఫోర్డ్ వంటి అకాడమీలపై సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

విద్యార్థులు, తల్లిదండ్రులను ఆకర్షించేందుకు తప్పుడు ప్రకటనలు చేస్తూ, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఇటువంటి అకాడమీలపై వెంటనే సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోకపోతే డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆయా అకాడమీల ముందు ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ధర్నా అనంతరం డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ నాయకులు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయ పరిపాలన అధికారి (A O) సుధాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో పేర్కొన్న సమస్యలను పరిశీలించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జి. సురేష్, ఉపాధ్యక్షులు ఏ. భాస్కర్, , కృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు అకల్ సింగ్, తిరుపతి, నాయకులు లక్ష్మణ్ , సురేష్,నితిన్, భూమేష్, తిరుపతి ,నరేంద్రర్,తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలే వ్యాపార కేంద్రాలవుతుంటే చోద్యం చూస్తున్న ప్రభుత్వాలు.



వద్దేపల్లి మల్లేశం

విద్యార్థి సంఘాల ముట్టడిలో బయటపడుతున్న అక్రమాలు.టై పాఠ్య, నోటు పుస్తకాలు, విద్యావసరాలన్నీ నిర్బంధంగా కొనడం అంటే నిజంగా సిగ్గుచేటు.

భారతదేశంలో విద్యావసరాన్ని సరైన కోణంలో ఆలోచించని ప్రభుత్వాల దుష్ఫలితాల కారణంగా అభివృద్ధి చెందిన దేశాలలో ఘనంగా విజయవంతం అవుతున్న కామన్ స్కూల్ మనదేశంలో మో డు వారి పోయింది అంటే అంతకుమించిన వైఫల్యం మరొకటి ఉండదు. దేశ అవసరాలకు అనుగుణంగా ఉండాల్సినటువంటి విద్యను వ్యాపార వస్తువుగా మార్చడం ఒకవైపు జరిగితే మరొకవైపు నైపుణ్యాలకు ఆస్కారం లేకుండా మొక్కుబడి సిలబస్తో కొనసాగుతున్న కారణంగా దేశ విద్య వైద్య ఉద్యోగ అవసరాలను తీర్చడానికి నిపుణుల కోసం ఇతర దేశాల పైన ఆధారపడవలసి వస్తున్నదని విద్యా వైజ్ఞానికులు ఆరోపిస్తున్న విషయాన్ని పాలకులు గుర్తించాల్సి ఉంది. ఇక సంక్షేమ రంగంలో ముఖ్యంగా విద్యా వైద్యం వ్యాపార వస్తువు కాకూడదు లాభనష్టాలతో బేరీజు వేయకుండా ప్రభుత్వాలు ఎన్ని కోట్లయినా ఖర్చు చేసి ప్రజల యొక్క చైతన్యాన్ని, ఆరోగ్యాన్ని పరిరక్షించాల్సినటువంటి బాధ్యతను విస్మరిస్తూ రెండు రంగాలను కూడా ప్రైవేటుకు దారా దత్తం చేయడం వల్ల ఇవాళ భారతదేశంకు ప్రపంచంలో ఏ దేశానికి లేని దుర్గతి పట్టింది. ఆ పరిస్థితికి మెరుగులు దిద్దే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వాలు మొక్కుబడి విద్యకు నిధులను కేటాయిస్తూ నాణ్యమైన విద్య పేద మధ్యతరగతి వర్గాలకు అందకుండా చేస్తుంటే రెండు రకాల విద్య కొనసాగుతున్న ఈ దేశంలో ప్రైవేటు రంగంలోనిదే నాణ్యమైన విద్య అని బహుళ ప్రచారంలో కొనసాగినప్పుడు పేద వర్గాలు అటువైపు ఆశపడకుండా ఉంటారా? అయితే నేమి ప్రపంచంలో లేని అధిక ఫీజులను బలవంతంగా వసూలు చేస్తుంటే పేద మధ్యతరగతి వర్గాలు తమ ఇల్లు వాకిళ్లను ఆస్తుల నమ్మి పిల్లల చదువులు చదివిస్తూ ఉంటే ప్రభుత్వాలు చూస్తూ మౌనంగావుం టున్నాయి. విద్యాహక్కు చట్టం ప్రకారంగా కనీసం 25% సీట్లను పేద వర్గాలకు కేటాయించవలసినటువంటి మౌలిక సత్యాన్ని, సూత్రాన్ని కూడా ప్రభుత్వం గుడ్డిగా మరిచింది అంటే బాధ్యతను ఎంత విస్మరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.తెలంగాణ నుండి యావత్ దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతూ ఉంటే విద్యా పరిరక్షణ కమిటీలు మేధావులు, విద్యార్థి ఉపాధ్యాయ ప్రజా సంఘాలు ఒక ప్రణాళిక అబద్ధమైనటువంటి పోరాట రూపాన్ని తీసుకో ని కారణంగా ప్రభుత్వాల దృష్టిలో విద్య వైద్యం చోటు సంపాదించకపోవడం విచారకరం.

డాక్టర్ డి ఎస్ కొఠారి 1966లో సూచించినటువంటి కామన్ స్కూల్ విధానాన్ని పక్కనపెట్టి విద్యార్థుల మధ్యన వివక్షత తేడాలు వ్యత్యాసాన్ని కొనసాగించే ప్రభుత్వ ప్రైవేటు రంగాలను సృష్టించి పెట్టుబడిదారీ వర్గాలకు అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తూ ఫీజుల పైన నియంత్రణ లేకుండా వాళ్ళ ఇష్టం ఉన్నట్టు వసూలు చేసుకోవడానికి అవకాశాలను కల్పిస్తున్నటువంటి ప్రభుత్వాల వింత ధోరణి ఏ వర్గ ప్రయోజనం కోసం? ఇంకా ఆలోచిస్తూ ఊరుకుంటే అంతకుమించిన బలహీనత మరొకటి ఉండదు. డబ్బున్న వాళ్లు ప్రైవేట్ రంగాన్ని ఎంచుకొని నమ్ముకున్నారు పూర్తి పేద వర్గాలకు ప్రభుత్వ పాఠశాలలు తప్ప వేరే మార్గం లేక ఆ పాఠశాలలు కనీస సౌకర్యాలకు నోసక వె లవె ల పోతున్నాయి. ఇక మధ్యతరగతి వర్గాలు ఆలోచిస్తూ తమ పిల్లల భవిష్యత్తు అంతా విద్య మీదనే ఉందని భావించే కొద్దిమంది తమ ఆస్తుల నమ్ముకుని ప్రైవేటు పాఠశాలలకు పంపుతుండడంతో అసలు సమస్య మొదలైంది. ఈ క్రమములో ఫీజుల నియంత్రణ కనీసంగా తెలంగాణ రాష్ట్రంలో గత 12 సంవత్సరాలుగా లేకపోవడం ఏటా పది నుండి 30% పెంచుకునే అవకాశం ఉండడంతో ప్రైవేటు వర్గాలు దూకుడుతో వ్యవహరిస్తుండడంతో అంతే స్థాయిలో తమ కందుబాటులో ఉన్నటువంటి వ్యాపార దృక్పథాన్ని కొనసాగిస్తూ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగులు, టై బెల్టులు విచ్చల విడిగా అధిక ధరలకు అమ్ముతూ ఉంటే మౌనంగా ఊరుకున్నటువంటి రాష్ట్ర ప్రభుత్వం యొక్క చర్యను ఏమనాలి? కనీసం తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థి సంఘాల యొక్క హెచ్చరికలు పోరాటాలు నిరసనలకు ప్రతిస్పందించిన స్థానిక విద్యాధికారులు మండల అధికారులు అక్రమంగా అమ్ముతున్నట్లు చూపిన ఆ సామాగ్రిని సీజ్ చేయించిన సందర్భాలు ఉంటే రాష్ట్రస్థాయిలో మాత్రం రాష్ట్ర ప్రభుత్వం ఉరుకుండడం హైదరాబాదు లాంటి చోట్ల యదేచ్ఛగా విక్రయించడం ఇదే చట్టబద్ధమైనటువంటి పరిపాలనగా ప్రభుత్వం భావించడం పైకి మాత్రం ఫీజులను నియంత్రణ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని ప్రకటించడంఅంటే పంచ పాండవులు మంచం కోళ్ల వలె ముగ్గురు అంటూ రెండు సంఖ్యను చూపిన విధంగా ఉంది.

తమ ఆస్తులను పెంచుకోవడానికి ప్రైవేటు విద్యా సామ్రాజ్యాలను తరతరాలకు విస్తరింప చేయడం లో భాగంగా కొన్ని వర్గాలు చేస్తున్న ఈ ప్రయత్నానికి ప్రభుత్వం ప్రజల పక్షాన ఆలోచించని కారణంగా ఈ దుష్ట చర్యలు నిరంతరము దర్శనమిస్తున్నాయి. మౌలికంగా విద్యా ప్రైవేట్ రంగంలో కొనసాగడానికి అవకాశం లేదు ఎందుకంటే అది మానవ విలువలను మూర్తిమత్వ వికాసాన్ని పెంపొందింప చేయడానికి ప్రాతిపదిక కనుక వ్యాపార దృక్పథానికి అవకాశం లేని ప్రభుత్వ రంగంలోనే సమర్థవంతంగా కొనసాగాలుగుతుంది. కానీ తమ బాధ్యతను విస్మరించి తప్పుకోవడానికి చూస్తున్నటువంటి రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు తమ అశక్తతను, అసమర్థతను కప్పిపుచ్చుకునే ప్రయత్నంలో విద్యా రంగానికి బడ్జెట్ పెంచుతున్నట్టు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు టీ టిఫిన్ అరేంజ్ చేస్తున్నట్లు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సౌకర్యాలను కల్పిస్తున్నట్లు డ్రెస్సులు అందిస్తున్నట్లు ప్రకటనలు గుప్పించడం వలన పిల్లలు ఆందోళనకు గురవుతున్నారు. పేద మధ్యతరగతి వర్గాలు కొంత అత్యాశతో ప్రభుత్వ పాఠశాలలను పక్కనపెట్టి ప్రైవేటు పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని భ్రమపడి అప్పులు చేయక తప్పడం లేదు. కానీ ఈ దేశంలో ప్రతి విద్యార్థికి కూడా ఉచితంగా నాణ్యమైన విద్యను అందుకునే అవకాశాన్ని భారత రాజ్యాంగం కల్పించినట్లు స్పష్టమైనప్పటికీ ఆచరణలో అమలు కాకపోవడానికి ప్రభుత్వాలు ఇంతవరకు బాధ్యత వహించలేదు. తమ తప్పును అంగీకరించలేదు, భవిష్యత్తులో చర్యలు చేపట్టడానికి స్పష్టమైన హామీ ఇచ్చిన దాఖలా అసలు లేదు కేంద్రం నుండి రాష్ట్రాల వరకు.

**ప్రభుత్వాలు రాజీ పడడం ఎందుకు**

తెలంగాణ రాష్ట్రంలోని అనేక మండలాలు జిల్లా పరిధిలో స్థానికంగా విద్యార్థి సంఘాలు అధిక ఫీజుల నియంత్రణకు విద్యావసరాల అక్రమ అమ్మకాన్ని నిరోధించడానికి పాఠశాలలను వ్యాపార కేంద్రాలుగా మార్చడాన్ని నిరసిస్తూ చేపట్టిన పోరాట కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వెళ్లకపోవడం విచారకరం. ఈ రకంగా విచ్చలవిడిగా కొనసాగుతూ ఉంటే హైదరాబాద్ మిగతా పెద్ద పట్టణాలలో భారీగా పుస్తకాలు నోట్బుక్కు బ్యాగులు టై బెల్టులను అదనంగా ఎక్కువ రేట్లకు అమ్మి సొమ్ము చేసుకుంటూ ఉంటే ప్రభుత్వం చోద్యం చూడడం విడ్డూరం. 1)ఇప్పటికే బాధ్యత మరిచిన ప్రభుత్వం తమిళనాడు ప్రభుత్వం అమలు చేస్తున్నటువంటి ఫీజుల నియంత్రణ షెడ్యూల్ను పరిశీలించి ఇటీవల ప్రకటనలు వచ్చిన వాస్తవాలను గుర్తించి ఆ రకంగా నియంత్రణకు చర్యలు చేపట్టాలి. 2) ప్రైవేట్ లో ఎలాంటి అమ్మకాలను కొనసాగకుండా నిషేధించాలి.3) కేంద్ర ప్రభుత్వ చట్టం మేరకు అన్ని కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లలో పేద మధ్యతరగతి వర్గాలకు ఉచిత అవకాశాన్ని చట్టబద్ధం చేసి అమల అయ్యేలా చూడాలి

**.ప్రైవేటు పెట్టుబడిదారీ వర్గాల ప్రయోజనాలకు ప్రభుత్వం తల ఒ గ్గ డం ఎందుకు?**

భారతదేశంలోనే అత్యధిక ఫీజు వసూలు చేస్తున్న రాష్ట్రంగా ఇవ్వాళ తెలంగాణ ఉందంటే విచారకరం సిగ్గుచేటు కూడా. తెలంగాణ ప్రపంచం తోనే పోటీ పడుతుందని ముఖ్యమంత్రి గారు ఎన్నో సందర్భాల్లో తెలియజేయడం జరిగింది మరి ప్రైవేటు ఫీజుల నియంత్రణలో కూడా ప్రపంచంతో పోటీ పడాలి కదా! కానీ పక్క రాష్ట్రాల కంటే ఎక్కువగా వసూలు చేస్తుంటే చోద్యం చూస్తున్న ప్రభుత్వ తీరు ఏ రకంగా సమంజసం. కొఠారి కమిషన్ సూచించిన మాదిరిగా కేంద్ర ప్రభుత్వం 10% రాష్ట్ర ప్రభుత్వాలు 30% నిధులను విద్యారంగానికి కేటాయించి తమ చిత్తశుద్ధిని చాటుకున్నప్పుడు క్రమక్రమంగా ప్రైవేటు వ్యవస్థ బలహీనపడితే ప్రభుత్వరంగాన్ని గాడిలో పెట్టడానికి పూర్తిస్థాయిలో ఉచిత నాణ్యమైన విద్య అందించడానికి అవకాశం ఉంటుంది. అందుకుగాను ప్రైవేటు పాఠశాలలను ప్రభుత్వాలు అవసరమున్న మేరకు స్వాధీనం చేసుకోవడంతో పాటు అర్హులైన ఉపాధ్యాయులను తీసుకోవడానికి ప్రయత్నం చేస్తే ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా కొంతవరకు ఈ రెండు నాలుకల ధోరణి లాగా ఉన్న రెండు పడవల ప్రయాణం విద్యా వ్యవస్థ ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉంటుంది. ఏది ఏమైనా ప్రభుత్వమే ఈ బాధ్యత తీసుకోవాలి ప్రజలకు మాత్రం నాణ్యమైన ఉచిత విద్య అందించడం తమ అంతిమ లక్ష్యంగా పెట్టుకుంటేనే ప్రభుత్వాలు భవిష్యత్తులో మనగలుగుతాయి, విద్యార్థి ప్రజా సంఘాలు కూడా పోరాటాన్ని విరమించుకుంటాయి. అంతకు మించిన స్థాయిలో విద్యారంగా ఫలాలు సామాన్య పేద మధ్యతరగతి ప్రజలకు అందే అవకాశం ఉంటుంది. అదే మన యొక్క విద్యారంగ ప్రయోజనం కావాల్సిన అవసరం ఉంది.









## రన్నింగ్ కాలమ్

అవసరమున్నా లేకున్నా
చెట్టు ఫలాలు పంచినట్లు
అంపశయ్యపై రోగులకు
ఆయుష్షును పెంచినట్లు

ఆరునెలలకు ఒకసారి
చేయాలంట రక్తదానం
ఒక్కమారు చేస్తేచాలు
దక్కు ముగ్గురి ప్రాణం



-పెనుగొండ బసవేశ్వర్..

## అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాల,కళాశాలలపై చర్యలు తీసుకోవాలి




తెలంగాణ స్టేట్ భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో పట్టణంలో ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో,కళాశాలలో అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు పిల్లలకు కావాల్సిన పాఠ్యపుస్తకాలు,స్కూల్ బ్యాగ్స్ మరియు యూనిఫామ్ లు అన్నీ కూడా వాళ్ల దగ్గరే కొనాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకు వస్తున్న యాజమాన్యాలపై తగు చర్యలు తీసుకోవాలని కరీంనగర్ జిల్లా మెజిస్ట్రేట్ మరియు కలెక్టర్ గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా వాసాల.శ్రీనివాస్ రావణ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మరీ ముఖ్యంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలో ప్రైవేటు విద్యాసంస్థల్లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా చేస్తున్న కార్పొరేట్ స్కూల్స్ మరియు కళాశాలపై ఉక్కు పాదం మోపాలని,విద్య హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అర్హులైన నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి విద్య హక్కు చట్టం ప్రకారం అన్ని కార్పోరేట్ స్కూల్స్ మరియు కళాశాలలో 25% ఉచిత విద్యను అందించాలని,డొనేషన్ల పేరుతో విద్యార్థులను వేధించరాదని,ప్రైవేటు పాఠశాలలు కళాశాలలో మౌలిక వసతులపై తనిఖీలు చేపట్టి ప్రమాణాలు పాటించని విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అనుమతి లేని కళాశాలలు పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకొని అలాంటి యజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకొని విద్య హక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, విద్యార్హత లేని టీచర్లను నియమించుకొని విద్య బోధన చేస్తున్న ప్రైవేట్ స్కూల్స్ మరియు కళాశాలల యజమాన్యాల లైసెన్సులను రద్దు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## మాదకద్రవ్యాల వినియోగ రహిత మండలంగా తిమ్మాపూర్ ను తీర్చిదిద్దుదాం.




తిమ్మాపూర్ మండలంలోని రామకృష్ణ కాలనీలో గల మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల యందు నషాముక్త్ భారత అభియాన్ వారోత్సవాలలో భాగంగా జూన్ 17 నుండి 26 వరకు జరిగే అవగాహన కార్యక్రమాల్లో భాగంగా మాదకద్రవ్యాలను వినియోగించడంలో భాగంగా కలిగే దుష్పరిణామాల గూర్చి పిల్లలకి అవగాహన కల్పించడం జరిగింది సామాజిక మాధ్యమాల ద్వారా మాదకద్రవ్యాల వినియోగం అనేది పెరిగింది. కావున వాటి బారిన పిల్లలు పడకుండా వారికి తగిన సలహాలు సూచనలు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మిషన్ వాత్సల్య ప్రతినిధి సాదినేని రమేష్ చైల్డ్ హెల్ప్ లైన్ ప్రతినిధి సుందరగిరి సాయి కిరణ్ గౌడ్ ఉపాధ్యాయులు పిల్లలు పాల్గొనడం జరిగింది....

## ఓటమి చెందినా.. మాట తప్పని గాజుల మహేష్

శంకరపట్నం జన సైన్యం

కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల పరిధిలోని మొలంగూర్ గ్రామానికి చెందిన గాజుల మహేష్ గ్రామ సర్పంచ్ గా స్వల్ప ఓట్ల మెజార్టీతో ఓటమి చెందాడు.ఎన్నికల హామీలలో భాగంగా గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఎవరైనా మరణిస్తే వారి కుటుంబానికి 10 వేలు ఆడపిల్ల జన్మిస్తే 5వేల రూపాయలు అందిస్తానని ప్రకటించడం జరిగింది.స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయినప్పటికీ,ఇచ్చిన మాట తప్పకుండా గ్రామాని చెందిన దాసారపు రాజ కొమరమ్మ ఇటీవల మరణించగా వారి కుటుంబానికి సోమవారం రోజున రూ.10 వేల రూపాయల ఆర్థిక సాయం చేసి ఉదారత చాటుకున్నాడు.ఇచ్చిన మాట తప్పకుండా మాట నిలబెట్టుకున్న మహేష్ ను గ్రామస్తులు అభినందిస్తున్నారు.కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## పాన్ షాపు యజమానుల సమస్యలు పరిష్కరించండి




కరీంనగర్ నగరంలో గత 30-40 ఏళ్లుగా దాదాపు 250 పాన్ షాపుల ద్వారా 2500 మంది జీవనోపాధి పొందుతున్న పాన్ షాప్ యజమానుల ఇటీవలే కాలంలో ప్రభుత్వ నిబంధనల ద్వారా ఎదుర్కొంటున్న సమస్యలను నిన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లగా పోలీసుల వద్దకు వెళ్లి ఈ సమస్యను పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్,మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు కి సూచించడంతో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం కి యాదగిరి సునీల్ రావు ,50 వ డివిజన్ కార్పొరేటర్ బోయినిపల్లి ప్రవీణ్ కుమార్ ,36వ డివిజన్ కార్పొరేటర్ తోట అనిల్ పాన్ షాప్ యజమానులతో కలిసి పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంని కలవడం జరిగింది కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు పోలీస్ కమిషనర్ తో పాన్ షాపు యజమానులు దశాబ్దాలుగా ప్రభుత్వ నిబంధనల ప్రకారమే వ్యాపారాలు చేసుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా పాన్ షాపులు నిర్వహిస్తే, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని వారు స్పష్టం చేశారు. పాఠశాలలు మరియు విద్యాసంస్థలకు 100 మీటర్ల లోపు పాన్ షాపులు ఉండకూడదన్న ప్రభుత్వ కొత్త చట్టాన్ని పాటించేందుకు యజమానులు పూర్తిగా సిద్ధంగా ఉన్నారు.100 మీటర్ల పరిధిలో ఉన్న పాన్ షాపులను అక్కడి నుండి తరలించడానికి యజమానులకు ఒక నెల రోజుల సమయం (గడువు) ఇవ్వాలని కోరారు.నిబంధనలకు కట్టుబడి, చట్టానికి లోబడి మాత్రమే యజమానులు తమ వ్యాపారాలను కొనసాగిస్తారని వారు సీపీ దృష్టికి తీసుకెళ్లారు.

స్పందించిన సిపి నెల రోజులు గడువు ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా పాన్ షాప్ యజమానులు అందరూ కూడా సిపి గారికి ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. తప్పకుండా నెలరోజుల లోపు పోలీసుల నిబంధనలను కచ్చితంగా పాటిస్తామని పాన్ షాప్ యజమానుల సంఘం స్పష్టం చేసింది. సీపీ గారిని మర్యాదపూర్వకంగా కలిసిన సంఘం ప్రతినిధులు, తమ వ్యాపారాలను నిబంధనలకు అనుగుణంగా మార్చుకోవడానికి నెల రోజుల గడువు ఇచ్చినందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా పాన్ షాప్ యజమానులు మాట్లాడుతూ.. చిన్న పిల్లలకు, మైనర్లకు మరియు స్కూల్ విద్యార్థులకు ఎలాంటి సిగరెట్లు గానీ, పాన్‌లు గానీ విక్రయించబోమని స్పష్టం చేశారు. అంతేకాకుండా, ఈ విషయాన్ని స్పష్టం చేస్తూ ప్రతి పాన్ షాప్ ముందు ప్రజల మరియు విద్యార్థుల అవగాహన కోసం ప్రత్యేక బ్యానర్లను కూడా ప్రదర్శిస్తామని వారు హామీ ఇచ్చారు. పాన్ షాప్ యజమానులు సమస్యలను సిపి గారి దృష్టికి తీసుకువెళ్లి వారికి నెలరోజుల గడువు ను ఇప్పిచ్చిన యాదగిరి సునీల్ రావు గారికి మరియు ఇతర నాయకులకు పాన్ షాప్ యజమానుల సంఘం కృతజ్ఞతలు తెలిపారు. పోలీసులకు ఈ విషయంలో సహకరిస్తామని పాన్ షాప్ యజమానుల సంఘం తెలిపింది.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిస్కారం చేయకుంటే సమ్మెకు సిద్ధం.




మున్సిపల్ సిబ్బందినందరినీ పర్మినెంట్ చేయాలి. 2వ పిఆర్ సిలో కనీస వేతనం రూ.26,000/-లుగా నిర్ణయించాలని, వివిధ విభాగాలలో పని చేస్తున్న ఉద్యోగ, కార్మికులందరికి డిఏ అమలు చేయాలని, మరణించిన కార్మికుల దహన సంస్కరాలకు రూ.30,000/లు ఇవ్వాలని, ఐఎఫ్ఎంఐఎస్ ఆన్లైన్ పోర్టల్ లో నమోదు కాని కార్మికుల పేర్లను నమోదు చేయాలని రిటైర్మెంట్ బెనిఫిట్ హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం తదితర సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం చేశారు.

తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్లు మరియు మున్సిపాలిటీలలో సుమారు 65 వేల మంది మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు పని చేస్తున్నారు. సంవత్సరాల తరబడి విధులు నిర్వహిస్తున్నారు.పర్మినెంట్, కనీస వేతనాలు అమలు కావడం లేదు. అర్హత కలిగిన వారికి ప్రమోషన్లు ఇవ్వడం లేదు. అనేక మున్సిపాల్టీలలో నెలల తరబడి వేతనాలు చెల్లించడం లేదు. కార్మికులకు ఎలాంటి రక్షణ సదుపాయాలు కల్పించకపోవడంతో పనిచేసే క్రమంలో ప్రమాదాలు జరిగి అనేక మంది మరణిస్తున్నారు. అటువంటి వారికి ప్రభుత్వం ఎలాంటి నష్టపరిహారం చెల్లించడం లేదు. దీంతో నిత్యం మురికి మళ్ళినాలలో పనిచేస్తున్న కార్మికులు అస్వస్థతకు గురైనా, రోగాల బారిన పడిన, ప్రమాదాలకు గురైన ఏలాంటి వైద్య సేవలు అందని పరిస్థితి ఎదురౌతుంది.అనేక మున్సిపాల్టీలలో ఉన్న ఈ సమస్యను పరిష్కరించి ప్రభుత్వ ఆసుపత్రులలో ఇఎస్ఐ వైద్య సేవలకు విభాగాన్ని కేటాయించి వైద్యాన్ని కార్మికులకు అందించాలనీ కోరారు.

CITU జిల్లా కార్యదర్శి గీట్ల ముకుందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులకు పిఆర్సిలలో నిర్ణయించిన మినిమమ్ బేసిక్-పేని కనీస వేతనంగా చెల్లిస్తున్న అనవాయితీ ఉంది. కానీ గత ప్రభుత్వం జీవో నెం.60 ప్రకటించినప్పటికీ జీఓలో పేర్కొన్న కేటగిరీల వారీ వేతనాలను మున్సిపల్ కార్మికులకు చెల్లించకపోవడంతో 11వ పిఆర్సి నిర్ణయించిన మినిమమ్ బేసిక్ రూ.19,000/-లు, రూ.22,900/-లు, రూ.31,040/-లను కేటగిరీల వారి వేతనాలు మున్సిపల్ కార్మికులకు అమలు కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేసి కనీస వేతనాలు చెల్లిస్తామని ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని హామినిచ్చింది. 2సంవత్సరాలు కావస్తున్నా అమలుకు నోచుకోలేదు. 2వ పిఆర్సి లోనైన కనీస వేతనం రూ.26,000/లుగా నిర్ణయించి కేటగిరీల వారిగా అమలు చేయాలి. వివిధ ప్రభుత్వం శాఖలలోని వారికి అమలు చేస్తున్న విధంగా మున్సిపల్ కార్మికులందరికి డిఏ అమలు చేయాలి.మున్సిపల్ సిబ్బందికి 2005-2006 సంవత్సరాల నుండి పి.ఎఫ్. ఇఎస్ఐ అమలౌతున్నది. కార్మికుల వాటా, ప్రభుత్వ వాటాను కలిపి కార్మికుల ఖాతాలలో జమ చేస్తున్నారు. అనేక మున్సిపాల్టీలలో కార్మికుల వేతనాల నుండి డబ్బులు కట్ చేస్తున్నప్పటికీ పి.ఎఫ్, ఇఎస్ఐఐ ఖాతాలలో జమ చేయడం లేదు. దీంతో కోట్ల రూపాయలకు బకాయిలు పెరిగిపోయాయి. తక్షణమే పి.ఎఫ్. ఇఎస్ఐ బకాయిల సమస్యను పరిష్కరించాలి. కార్మికుల వయస్సు పైబడిన, అనారోగ్యానికి గురైన, చనిపోయిన కార్మికుల స్థానంలో గతంలో అవకాశం కల్పించిన విధంగా మున్సిపల్ కార్మికుల స్థానంలో రీప్లేస్మెంట్ చేయాలి మున్సిపాల్టీలలో విలీనమైన పంచాయతీల కార్మికులకు గెజిట్ అయిన నాటినుండే మున్సిపాల్టీలలో అమలు చేస్తున్న వేతనాలు ఇవ్వాలి. దహన సంస్కరాల ఖర్చులకు రూ.30,000/లు చెల్లించాలి. ఐఎఫ్ఎంఐఎస్ ఆన్లైన్ పోర్టల్లో నమోదు కాని మున్సిపల్ కార్మికుల పేర్లను తక్షణమే నమోదు చేయాలి, ఉద్యోగ భద్రత కల్పించాలి. పని చేసిన కాలానికి వేతనాలు చెల్లించాలనీ అంశాలను దృష్టిలో పెట్టుకొని నూతన పిఆర్సిలో కనీస వేతనం రూ.26,000/-లు నిర్ణయించాలని, మున్సిపల్ సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేయాలని, కొత్త కార్మికులకు జీఓ ప్రకారం వేతనాల అమలు, తమరి పరిధిలోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమం లో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎడ్ల రమేష్, సహాయ కార్యదర్శి పున్నం రవి,యూనియన్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపెల్లి రవి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కంపెల్లి పోచయ్య, కార్పొరేషన్ కమిటీ అధ్యక్షుడు మనుపాటి మల్లేశం, జంగం రవీందర్,చంద్రకళ,జంగపెల్లి లక్ష్మి, వద్లూరి అంజయ్య, రసపెల్లి సరోజన,రొంటాల భాగ్య,బోళ్ల శ్రీనివాస్, కూర రాజు, ఎర్రళ్ల రాజయ్య,కొలుగురి తిరుపతి, పాల్గొన్నారు.




## ఘనంగా అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ జూనియర్ కాలేజెస్ చుం-చం ఫ్రెషర్స్ డే సంబరాలు



**జనసైన్యం సిటి**

విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను వమ్ము చేయకుండా కష్టపడి నెరవేర్చాలని మరియు ఇతరులకు ఆదర్శంగా నిలవాలని చొప్పదండి శాసనసభ్యులు మరియు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం గారు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యతో సమాజంలో చాలా గొప్ప గుర్తింపు పొందగలుగుతామని మరియు సమయాన్ని వృధా చేయకుండా చదువులో పట్టు సాధించి అగ్రస్థానంలో నిలవాలని వారు చెప్పారు. విద్యార్థులు ఎవరైతే అగ్రస్థానంలో ఉంటారో వారికి భవిష్యత్తులో అవకాశాలు చాలా పుష్కలంగా ఉంటాయని తెలిపారు. ఎంతోమంది ప్రముఖులు చదువుతో ఖ్యాతి చెందారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని ప్రత్యేకంగా వారు విద్యారంగంపై దృష్టి సారించడం చాలా గొప్ప విషయమని వారు చెప్పారు. విద్యారంగంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుడుతూ అద్భుతమైన విజయాలు సాధిస్తున్నారని వారు చెప్పారు

మన తెలంగాణ రాష్ట్రంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల యొక్క పాత్ర చాలా ప్రశంసనీయమైనదని మరియు విద్యార్థులకు నమ్మశక్యము గానీ ఫలితాలను సాధించి దిక్సూచి గా నిలుస్తున్నదని కొనియాడారు. నరేందర్ రెడ్డి చేస్తున్నటువంటి కృషి చాలా ఆదర్శనీయమైనదని మరియు వారు అవలంబిస్తున్నటువంటి విద్యా విధానాలు చాలా చాలా గొప్పవాని కొనియాడారు . డాక్టర్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు గత 36 సంవత్సరాలుగా తరగని ఉత్సాహంతో ఘన విజయాలే లక్ష్యంగా ముందుకు పయనిస్తూ సమాజంలో అగ్రస్థానంలో నిలుస్తున్నామని వారు చెప్పారు. విద్యార్థుల సైతం అధ్యాపకుల యొక్క సూచనలను పాటిస్తూ చాలా గొప్ప ఫలితాలు సాధిస్తున్నారని గుర్తు చేశారు. అదే విధంగా ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు 109 మంది విద్యార్థులు భారతదేశ ప్రఖ్యాత ఐఐటీలలో, ఎన్ఐటీలలో, ఐఐఐటిలలో సీట్లను సాధించి నూతన చరిత్రకు బీజం వేశారని వారు చెప్పారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలను పాటిస్తూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడమే కాకుండా వారిలో విశ్వాసం నింపతూ పలు పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయడం మరియు విజయం సాధించడానికి ప్రోత్సాహాన్ని అందించడం జరుగుతుందని వారు చెప్పారు. వేడుకలలో భాగంగా ఐఐటీలలో, ఎన్ఐటీలలో ట్రిపుల్ ఐటీలలో సీట్లు సాధించిన విద్యార్థులకు ఘనంగా సన్మానం చేశారు.








వేడుకలలో భాగంగా విద్యార్థుల ప్రదర్శించినటువంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించినందుకు నరేందర్ రెడ్డి గారిని తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## నిరుపేదలు వేసుకున్న గుడిసెలకు ఇంటిపట్టాలిచ్చి, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

**జనసైన్యం సిటి**




హనుమకొండ: గుండ్ల సింగారం, గోపాలపురంలో పేదల ఇళ్ళు కూల్చి వేయడం దుర్మార్గమని, కూల్చివేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, మండలంలో పలు ప్రాంతాల్లో నిరుపేదలు వేసుకున్న గుడిసెలకు ఇంటిపట్టాలిచ్చి, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోట్ల చక్రపాణి లు అన్నారు. సోమవారం నిరుపేదలు వేసుకున్న గుడిసెలకు ఇండ్ల స్థలాల పట్టాలిచ్చి, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, గుండ్ల సింగారం, గోపాలపురంలో నిరుపేదల గుడిసెలను కూల్చివేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ హనుమకొండ తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో మహా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ రేణుక కు మెమొరాండం ఇచ్చారు. అనంతరం సిపిఐ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, సిపిఎం మండల కార్యదర్శి గాదె రమేష్ ల అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బోట్ల చక్రపాణి హాజరై మాట్లాడుతూ భూపోరాటాల ద్వారా ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకుని దశాబ్దాలుగా నివాసముంటున్న, నిరుపేదలైన ప్రజలకు ఇండ్ల స్థలాల పట్టాలు ఇవ్వడంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని ఆయన మండిపడ్డారు. ఒకవైపు పేదలకు గూడు లేక ఇబ్బంది పడుతుంటే, మరోవైపు విలువైన ప్రభుత్వ భూములు ల్యాండ్ మాఫియా పరం అవుతున్నాయని ఆరోపించారు. అనేక సంవత్సరాలుగా వెయ్యిలాది మంది నిరుపేద కుటుంబాలు గుడిసె వేసుకొని నివసిస్తున్న గుండ్ల సింగారం, గోపాలపురంలో నిరుపేదలు వేసుకున్న గుడిసెలను నిర్దాక్షిణ్యంగా కూల్చివేయడం దారుణమని అవేదన వ్యక్తం చేశారు. ఈ కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వామ పక్ష పార్టీల ఆధ్వర్యంలో హనుమకొండ మండలంలోని గుండ్లసింగారం, గోపాలపురం, పలువేల్పుల గ్రామంలో రెండు చోట్ల, పలువెల్పుల శివారులోని సీతారాం ఏచూరి నగర్, పెద్దమ్మ గడ్డ ప్రాంతంలోని జ్యోతిబసు నగర్ ఫేస్ 1 ,ఫేస్ 2, గొల్లపల్లె ప్రాంతంలోని భగత్ సింగ్ నగర్, హనుమకొండ నగరంలో గంగసాని తిరుమల రెడ్డి నగర్, జంగభద్రయ్య నగర్, ఎల్ వెంకట్ రామయ్య నగర్, సుందరయ్య నగర్ 1, సుందరయ్య నగర్ 2, ఇంజనీరింగ్ కాలనీ(యూనివర్సిటీ), భగత్ సింగ్ నగర్, అంబేద్కర్ నగర్ వంటి మండలంలో దాదాపు 25 ప్రాంతాల్లో వేలాది మంది బడుగు, బలహీన, మైనారిటీ వర్గాలకు చెందిన పేదలు గుడిసెలు వేసుకొని అక్కడే స్థిరనివాసం ఏర్పాటు చేసుకొని జీవనం గడుపుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పలు ప్రాంతాలలో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న పేదలందరికీ 58 జీవో ప్రకారంగా ఇంటి పట్టాలను మంజూరు చేయడంతో పాటు విద్యుత్, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం వంటి మౌళిక సదుపాయాలను సైతం కల్పించేలా మరియు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వామపక్షాల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఐ హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, సీపీఎం నార్త్ ఏరియా కార్యదర్శి గాదె రమేష్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి గుంటీ రాజేందర్, సీపీఐ, సీపీఎం మండల నాయకులు పెండ్యాల రవి, కట్కూరి కృష్ణ, కోడపాక బాబు, మామునూరి దామోదర్, ఇంజపెల్లి రాజు, మాలోత్ మంగ, గిన్నారపు రోహిత్, నాయకులు సందీప్ ప్రతాప్, గుగులోత్ సురేష్, తాటికంటి మమత, తాటికొండ ప్రశాంత్, కుమారస్వామి, రాధా, ముల్కాపురి రమా, రాజేష్, గుడిసె వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్ సమయస్ఫూర్తితో స్పందించడంతో నలబై మంది ప్రాణాలు దక్కాయి.

**జనసైన్యం సిటి**




కరీంనగర్ జిల్లాలో అల్గనూర్ వద్ద నిన్న బస్సు దగ్ధం జరిగిన ప్రమాదంలో 40.మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడి దైర్య సహాసాన్ని చూపిన కరీంనగర్ ఆర్టీసి 2 డిపోకు చెందిన బస్సు డ్రైవర్ బోయిని ప్రశాంత్ ను తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ ఆధ్వర్యంలో సన్మానం చేసి అభినందించాడం జరిగింది.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరీంనగర్ టు డిపోకు చెందిన ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు పూర్తిగా దగ్ధం అవుతున్న సందర్భంలో సమయస్ఫూర్తితో వ్యవహరించి బస్సు డ్రైవర్ బోయిని ప్రశాంత్ ప్రయాణికుల ప్రాణాలను కాపాడడంలో వారు వ్యవహరించిన తీరు అభినందనీయం సమయానికి వారు బస్సును ఆపి ప్రయాణికులు అందరిని కిందికి దించడంతో దాదాపు 40 మంది ప్రాణాలను కాపాడినడని అందుకే తెలంగాణ రక్షణ ఆధ్వర్యంలో ఆర్టీసీ డ్రైవర్ బోయిని ప్రశాంత్ అభినందిస్తూ సన్మానించడం జరిగింది. వారు సమయస్ఫూర్తితో స్పందించడం వల్లే ఈరోజు ఇంతమంది ప్రాణాలను కాపాడుకోగలిగినామని ప్రభుత్వం కూడా మన ఆర్టీసీ బస్సులు బయలుదేరే ముందు అన్ని విధాల తనిఖీలు చేసిన తరువాతనే బయటికు పంపాలని బస్సు కాలిపోవడానికి కారణాలను కూడా వెతికి ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని ఏ విధమైన కారణాలు ఉన్నాయో ప్రభుత్వం ఎంక్వయిరీ చేసి ఇటువంటి సంఘటనలు మళ్ళీ మళ్ళీ జరగకుండా చూడాలని ఆర్టీసీ బస్సుల ప్రమాదాలను నివారించాలని ఈ ప్రభుత్వాన్ని తెలంగాణ రక్షణ సేన డిమాండ్ చేస్తుందని గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదివాసి విభాగం అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్, జంగ అపర్ణ సాగర్, బాసావేణి రజేందర్, నూతి చరణ్, యండి హుస్సేన్, గర్షకుర్తి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## మేయర్ల శిక్షణ కార్యక్రమానికి హాజరుకానున్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**జనసైన్యం సిటి**

హైదరాబాదులోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్మెంట్ (N I U M), తెలంగాణ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (C D M A) ఆధ్వర్యంలో 23-06-2026 మంగళవారం నిర్వహించనున్న మేయర్ల శిక్షణ కార్యక్రమానికి కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ హాజరుకానున్నారు.రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లకు పట్టణాభివృద్ధి, నగర పాలన, ప్రజా సేవల మెరుగుదల, మౌలిక వసతుల ప్రణాళిక, సుస్థిర పట్టణాభివృద్ధి అంశాలపై అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.





## వరి సంజయ్ కి జన్మదిన శుభాకాంక్షలు



## వరాల అనిల్ కి జన్మదిన శుభాకాంక్షలు

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా శెట్టి సుధాకర్



జనసైన్యం సిటి

హుస్నాబాద్ నియోజకవర్గం కోహెడ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడుగా వింజపల్లి గ్రామానికి శెట్టి సుధాకర్ చెందిన నియమించినట్లు టీపీసీసీ కార్యనిర్వహక అధ్యక్షుడు మహేశ్కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు గతంలో వింజపల్లి మాజీ సర్పంచ్ శెట్టి సుధాకర్ చేసిన సేవలను గుర్తించి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చిట్టి సుధాకర్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో కార్యకర్తలను సమీకరించి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు తన నియామకానికి సహకరించిన హుస్నాబాద్ నియోజక వర్గ శాసన సభ్యులు రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారి సూచన మేరకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ నియమించారు.

## కరీంనగర్ - వరంగల్ జాతీయ రహదారిపై కొత్తగట్టు వద్ద 'ర్యాంప్' ఏర్పాటుకు లైన్ క్లియర్!



జనసైన్యం సిటి

కరీంనగర్ - వరంగల్ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా, శంకరపట్నం మండలం కొత్తగట్టు వద్ద ఇరువైపులా ర్యాంప్ ఏర్పాటు చేయాలని స్థానికులు చేస్తున్న విజ్ఞప్తికి మోక్షం లభించింది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదేశాలతో హైవే అధికారులుస్పందించి,పనులుచేపట్టేందుకు సిద్ధమయ్యారు. గతంలో కొత్తగట్టు గ్రామ ప్రజలు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర మంత్రిని కలిసి తమ ప్రాంతంలో రహదారి ఇరువైపులా ర్యాంప్‌ను ఏర్పాటు చేయాలనివిన్నవించారు. ర్యాంప్ లేకపోవడం వల్ల స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని వారు వివరించారు.ప్రజల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, ఇటీవల హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ భరద్వాజ్ కు కొత్తగట్టు ప్రాంత సమస్య పరిష్కరించాలని సూచించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, రహదారికి ఇరువైపులా ర్యాంప్‌ను ఏర్పాటు చేయాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.మంత్రి ఆదేశాల మేరకు, అధికారులు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి, ర్యాంప్ నిర్మాణానికి అవసరమైన చర్యలను ప్రారంభించారు. దీనితో కొత్తగట్టు, చుట్టుపక్కల గ్రామస్తుల రవాణా ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఫైల్ ట్రాకింగ్ చేస్తున్నాం




జనసైన్యం సిటి

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఫైల్ ట్రాకింగ్ చేస్తున్నామని దరఖాస్తులను పెండింగ్లో ఉంచకుండా పరిష్కారించడానికి అన్ని చర్యలుతీసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్ర మీశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 192 మంది అర్జీదారులు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని అధికారులకు బదిలీ చేశారు. త్వరితగతిన దరఖాస్తులు పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తులు క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి శాఖ వారిగా ఆన్లైన్లో దరఖాస్తుల ప్రక్రియను పరిశీలిస్తున్నామని చెప్పారు. శాఖల వారీగా దరఖాస్తుల సంఖ్య, పెండింగ్ దరఖాస్తులను సమీక్షించారు. ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ అన్నారు. ప్రజావాణిలో అశ్విని తానాజీ వాకడే, డిఆర్ఓ స్వామి ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనకు అందరు ముందుకు రావాలి

జనసైన్యం సిటి




నషా ముక్త్ భారత్ అభియాన్ (N M B A) కార్యక్రమంలో భాగంగా ఈ రోజు కరీంనగర్ పట్టణంలోని కర్కానా గడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మరియు ఓల్డ్ హైస్కూల్‌లో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ (1098) జిల్లా కోఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలను వివరించి, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు.విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఎటువంటి సమస్యలు ఎదురైనా పోలీస్ 100 లేదా చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సహాయం పొందాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుళ్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.